
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

ఖమ్మం

KHAMMAM

గురువారం, 15 మే 2025

5



భద్రాచలంలో దొంగలదోపు ఉత్సవం దృశ్యం

బ్రహ్మోత్సవాలకు ముగింపు

- సంప్రదాయబద్ధంగా తెప్పోత్సవం, దొంగలదోపు

భద్రాచలం, మే 14(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి అనుబంధ ఆలయమైన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. ఈ నెల 10న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయగా 12వ తేదీన స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాగా మంగళవారం స్వామివారికి రథోత్సవం నిర్వహించారు. బుధవారం గోదావరిలో శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారికి తెప్పోత్సవాన్ని ఆహ్లాదకరంగా నిర్వహించారు. రాత్రి దొంగల దోపు ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కాగా నేటితో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

యువవికాసం అర్జీదారులకు 'సిబిల్' గుబులు

- బ్యాంకుల నుంచి వివరాలు పొందాలంటున్న గ్రామాధికారులు
- అయోమయంలో దరఖాస్తుదారులు

7



రాష్ట్ర కేబినెట్‌లో కీలకపాత్ర పోషిస్తున్న ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఇప్పటి వరకు ఎవరికివారే యమునాతీరే అన్నట్లు పర్యటనలు సాగించగా ఇటీవల కాలంలో కొత్తమార్పు కనిపిస్తోంది. కొన్నిచోట్ల ముగ్గురు, మరికొన్ని చోట్ల ఇద్దరు కలిసి పర్యటనలు సాగించడం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మంత్రుల మధ్య పెరిగిన ఈ దోస్తీ శాశ్వతమా తాత్కాలికమా అన్న అంశంపై జిల్లాలోని అధికార, విపక్ష పార్టీల్లో చర్చ జరుగుతోంది. ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ముగ్గురు మంత్రులు కలిసి జిల్లాకు వచ్చి ఐక్యత చాటారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి పర్యటన, జిల్లా సమీక్షలు, మున్నేరు వరదలు, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కలిసి కనిపించారు.

- జిల్లాలో మంత్రుల మధ్య చిగురిస్తున్న సమన్వయం
- ఉమ్మడిగా అభివృద్ధి కార్యక్రమాలకు హాజరు
- ఏడాది తరువాత ఏకతాటిపైకి ముగ్గురు నేతలు
- ఇదే వరవడి కొనసాగితే జిల్లా అభివృద్ధికి ఊతం

కలిసి నడిచేనా?

ఖమ్మం, మే 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గతంలో జిల్లాకు చెందిన మంత్రులు తమ నియోజకవర్గాల్లో తిరిగినా, ఇతర నియోజకవర్గాలకు వెళ్లినా ఎవరో ఒక్కరే వెళ్లి కార్యక్రమాలు నిర్వహించేవారు. గత ఏడాది కాలంలో జిల్లాలో ముగ్గురు మంత్రుల పర్యటనలు ఎవరికి వారే అన్న చందంగా సాగాయి. అయితే ఇటీవల కొంత మార్పు కనిపిస్తోంది. ఇటీవల ఖమ్మం మెడికల్ కళాశాల శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ పర్యటన సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్ని సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. చాలాకాలం తర్వాత ఈ ముగ్గురు కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడం ఆసక్తికరంగా మారింది. పైకి అంతా ఐక్యమని చెబుతున్నా అంతర్గతంగా ఎవరివారు తమదైన శైలిలో ప్రయాణం సాగిస్తున్న క్రమంలో ఖమ్మం మెడికల్ కాలేజీ శంకుస్థాపన కార్యక్రమంలో అందరూ కలిసి పాల్గొనడం చర్చనీయాంశమైంది.

మరోవైపు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా జిల్లాలో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తుండడం మరింతగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల అశ్వారావుపేట నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని పర్యటన రూపకల్పన చేశారు. ఇద్దరు కలిసి ఇల్లెందు నియోజకవర్గంలో పర్యటిస్తారని ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రకటించారు. అయితే మంత్రి పొంగులేటి ఇల్లెందు పర్యటనకు వెళ్లలేదు. దీంతో భట్టి ఒక్కరే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గతంలో ఈ ఇద్దరి మధ్య రాజకీయంగా చాలాకాలం ఎడబాటు ఉంది. పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు 2014లో వైఎస్ఆర్ కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీచేయగా, అప్పుడు కాంగ్రెస్ ఓటుబ్యాంకు భారీగా చీలే పరిస్థితి ఉండడంతో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న భట్టి విక్రమార్క, మంత్రిగా ఉన్న రాంరెడ్డి వెంకటరెడ్డి నియోజకవర్గాల్లో వైసీపీ పోటీచేయకుండా సీపీఎం పోటీ చేసింది. దీంతో కాంగ్రెస్, వైసీపీల మధ్య క్రాస్ ఓటింగ్‌తో అటు ఎంపీగా పొంగులేటి, ఎమ్మెల్యేలుగా భట్టి విక్రమార్క, రాంరెడ్డి వెంకటరెడ్డి అప్పట్లో గెలుపొందారు. వైసీపీతో మిత్రపక్షంగా ఉన్న సీపీఎం రెండుచోట్ల ఓటమిచెందగా పొంగులేటి గెలుపులో కూడా సీపీఎం కీలక పాత్ర పోషించింది. అప్పట్లో కాంగ్రెస్, వైసీపీల మధ్య మిత్రుత్వం సాగినా పొంగులేటి బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత మధిర నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న భట్టి విక్రమార్క నియోజకవర్గంపై కూడా పొంగులేటి దృష్టిపెట్టడంతో ఇద్దరి మధ్య అప్పట్లో రాజకీయంగా విమర్శలు, ప్రతి విమర్శలు సాగాయి. అలా చాలాకాలం ఇద్దరి మధ్య గ్యాప్ నడిచింది. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత కూడా చాలా కాలం ఇద్దరి మధ్య సఖ్యత లేదన్న అభిప్రాయాలు వినిపించాయి. అయితే ఇటీవల వారిద్దరూ కలిసి సాగిస్తున్న పర్యటనలు ఆసక్తి కలిగిస్తున్నాయి.

కలిసి పనిచేస్తే కలదు లాభం..

ఇక జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో టీడీపీ నుంచి మంత్రిగా వ్యవహరించినా తన రాజకీయ దృష్టంతా మైదాన, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధిపైనే ఉంచేవారు. రాజకీయంగా, సిద్ధాంతపరంగా ఆయనపై విమర్శలు ఉండేవి తప్ప వ్యక్తిగతంగా ఆయనపై విమర్శలు ఉండేవికావు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో కూడా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు సముచిత స్థానం కల్పించారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో కూడా మంత్రిగా జిల్లా అభివృద్ధిపైనే దృష్టి పెట్టి రాజకీయ విమర్శలకు తావులేకుండా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరి వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో మంత్రి తుమ్మల జిల్లాలోని ఇతర నియోజకవర్గాలతో పాటు తన నియోజకవర్గంలో జరిగే ముఖ్య కార్యక్రమాలకు ఇతర మంత్రులను సైతం ఆహ్వానిస్తున్నారు. ఇతర నియోజకవర్గాల్లో తన మార్క్ చూపిస్తూ ఒంటరిగానే ఎక్కువచోట్ల కార్యక్రమాల్లో పాలు పంచుకుంటుండగా కొన్ని సందర్భంలో భట్టి, పొంగులేటితో కలిసి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జిల్లాలోని ముగ్గురు మంత్రులు రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నందున వీరంతా కలిసి పనిచేస్తే ప్రభుత్వానికే కాకుండా జిల్లాకు కూడా ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు కోరుతున్నారు.



చింతగుర్తిలో సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అభివృద్ధిలో రాజీ లేదు

- గతంలో శాసనసభ్యుడిగా ఇప్పుడు మంత్రిగా ప్రజల కోసమే నా జీవితం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- చెరువులకు సాగర్ నీళ్లపై రైతులు, చేపల సొసైటీల హర్షం..

రఘునాథపాలెం, మే 14(ఆంధ్రజ్యోతి): తాను గతంలో ఖమ్మం ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో అధికార పార్టీలో లేక పోయినా ఎస్సీ కాలనీలకు నూరుశాతం సీసీ రహదారులు నిర్మాణం చేశానని, ప్రజల దీవెనలతో మళ్లీ మంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రజల అవసరాల మేరకు అభివృద్ధిలో రాజీ పడకుండా ప్రజల కోసమే తన రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నానని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చింతగుర్తి ఎస్సీ కాలనీలో బుధవారం సీసీ రహదారులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు. గ్రామంలోని నాయకులను పేరుపేరునా పిలిచి చింతగుర్తి గ్రామంలో ఎమ్మెల్యేగా చేపట్టిన పనులపై మాట్లాడించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను అభివృద్ధిలో ఎప్పుడు రాజకీయ వివక్ష చూపలేదన్నారు. అన్ని సామాజిక వర్గాల ప్రజలకు కావాల్సిన మౌళిక సౌకర్యాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చింతగుర్తిలో ఉన్న సమస్యలను మాజీ సర్పంచ్ తమ్మినేని నాగేశ్వరరావుతో పాటు స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

చెరువులకు సాగర్ నీళ్లపై రైతుల హర్షం..

రఘునాథపాలెం మండలంలోని 36 చెరువులకు నాగార్జునసాగర్ జలాలు చేరటంపై మండలంలోని పలు గ్రామ పంచాయతీల చేపల చెరువుల సొసైటీల ఛైర్మన్లు, రైతులు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చేపల చెరువుల సొసైటీల ఛైర్మన్లు, రైతులు మంత్రిని సన్మానించేందుకు సిద్ధం కాగా ఆయనే తిరిగి రైతులను శాలువాతో సన్మానించారు. రైతులు బాగుంటేనే దేశం (మిగతా 6వ పేజీలో)



ఎర్రుపాలెంలో 50 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రతి పేద కుటుంబానికి ఉచిత వైద్యం

- రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంచాం
- ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల రాష్ట్రంగా మార్చింది
- ప్రభుత్వం ఖర్చుపెట్టిన ప్రతి పైసా లెక్క చెబుతాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ఎర్రుపాలెంలో 50పడకల ఆసుపత్రికి శంకుస్థాపన

ఎర్రుపాలెం, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రతి పేద కుటుంబానికి ఉచిత వైద్యం అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలకేంద్రంలో 50పడకల ఆసుపత్రికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగసభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత 90లక్షల రేషన్ కార్డుదారులందరికీ రాజీవ్‌ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య ఖర్చుల పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్యశాఖకు రూ.11,600 కోట్లు కేటాయించామని, భవిష్యత్తులో వైద్యరంగానికి పెద్దపీట వేస్తామని వివరించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలను విస్మరించిందని, రూ.7లక్షల కోట్లు అప్పులు చేసి ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిందని విమర్శించారు. 'డబుల్‌బెడ్‌రూం' పేరుతో ఇళ్లులేని పేదలను అవహేళన చేసిందని దుయ్యబట్టారు. వచ్చే ఐదేళ్లలో ఇళ్లులేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా 90లక్షల కుటుంబాలకు సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. అటవీహక్కు చట్టం ద్వారా పట్టా పొందిన రైతులందరికీ ఇందిరగిరి, జల వికాసం ద్వారా ఉచితంగా బోర్లు, పంపుసెట్లు, సోలార్ విద్యుత్, పామాయిల్, అవకాడో మొక్కలను ఉచితంగా సరఫరా చేయబోతున్నట్లు తెలిపారు. యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.9వేల కోట్లతో 5లక్షల మంది యువతకు రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరుస్తామన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికి (మిగతా 6వ పేజీలో)

సగం ధరకే పచ్చిరొట్ట విత్తనాలు

6

- భూమికి శక్తినివ్వడంలో మేటి
- అందుబాటులో జీలుగు, జనుము, పిల్లి పెసర

'ఆంధ్రజ్యోతి లక్కీడ్రా' కారు విజేతకు చెక్కు అందజేత

- రాష్ట్రస్థాయి విజేతకు చెక్కు అందించిన ఖమ్మం మునిసిపల్ కమిషనర్



విజేత గుడిపూడి శ్రీనివాసరావు దంపతులకు చెక్కు అందజేస్తున్న ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆంధ్రజ్యోతి ఖమ్మం బ్రాంచ్ మేనేజరు పుల్లారావు

ఖమ్మం, మే14(ఆంధ్రజ్యోతి): అక్షరమే ఆయుధంగా ముందుకు సాగుతూ ప్రజల మన్ననలను అందుకుంటున్న 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో తెలంగాణ రాష్ట్రస్థాయిలో కారును గెలుపొందిన గుడిపూడి శ్రీనివాసరావుకు బుధవారం ఖమ్మం యూనిట్ కార్యాలయంలో చెక్కు అందజేశారు. హైదరాబాద్‌లోని 'ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంలో గత నెల 11న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని డ్రా తీసి విజేతలను ప్రకటించారు. అందులో ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం రామాపురానికి చెందిన రైతు గుడిపూడి శ్రీనివాసరావును అదృష్టం వరించింది. ఈ నేపథ్యంలో విజేత శ్రీనివాసరావుకు ఖమ్మం ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య చేతుల మీదుగా కారుకు సంబంధించిన నగదు చెక్కును అందజేశారు. రైతు శ్రీనివాసరావు ఆయన సతీమణి నాగేంద్రలు కమిషనర్ చేతుల మీదుగా చెక్కును అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకుని రావడంలో 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక స్థానం ఉందన్నారు. పాఠకుల కోసం 'ఆంధ్రజ్యోతి' లక్కీ డ్రా నిర్వహించడం (మిగతా 6వ పేజీలో)

ధాన్యం.. దైన్యం

- అకాల వర్షాలతో అన్నదాతకు కన్నీళ్లు
- కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు నిల్
- భద్రాద్రి జిల్లాలో మూడు మిల్లులకే ధాన్యం కేటాయింపు
- తరలింపులో తీవ్ర జాప్యంతో నష్టపోతున్న రైతులు

వివరాలు : 7లో

ప్రభుత్వ కాలేజీలో ఇంటర్ చదివితే

బీటెక్ ఫ్రీ



- పూర్తి ఫీజు రాయితీ ప్రకటించిన ప్రభుత్వం
- ఎంసెట్‌లో పదివేలపైన ర్యాంకు వచ్చినా అవకాశం

ఖమ్మం ఖానాపురం హవేలీ, మే 14(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ చదివి ఎంసెట్‌లో 10వేలకు పైగా ర్యాంక్ వచ్చినా ర్యాంక్ ప్రకారం వివిధ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ఇంజనీరింగ్ విద్యను అందించనున్నది. గత రెండేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివి ఉత్తీర్ణులైన అన్ని వర్గాల విద్యార్థులకు అందిస్తున్న ఉచిత విద్యను ఈ ఏడాది కొనసాగించనున్నారు. ఎంసెట్‌లో పదివేల కంటే ఎక్కువ ర్యాంకు వచ్చినా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించనుంది. గతంలో ఓసీ, బీసీ విద్యార్థులకు ఎంసెట్‌లో పదివేలలోపు ర్యాంకు వస్తేనే ఇంజినీరింగ్‌లో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండేది. గత మూడేళ్లుగా ప్రభుత్వ కాలేజీల్లో చదివిన విద్యార్థులకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చింది. ప్రభుత్వ నిర్ణయంతో ఎంసెట్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. టాప్‌టెన్ ఇంజినీరింగ్ కాలేజీల్లో సీటు వచ్చినా విద్యార్థులకు ఈ అవకాశం ఉంటుంది. గత ఏడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 200 మంది విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పూర్తి చేసి పలు ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు పొందారు. సుమారు 40 మంది విద్యార్థులు టాప్‌టెన్ కళాశాలల్లో సీట్లు పొందినట్లు ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు, గత ఏడాది ఎంసెట్ కో-ఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. విద్యార్థులు కౌన్సిలింగ్ రోజున ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సంబంధించిన పత్రాలను తప్పకుండా తీసుకెళ్లాల్సి ఉంటుంది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జూన్ చివరి వారంలో మొదటి దశ కౌన్సిలింగ్ నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రారంభమవుతుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో భాగంగా ఎంసెట్‌లో 10వేలలోపు ర్యాంకు వచ్చినవారికి ఏ కాలేజీలో సీటు వచ్చినా పూర్తి ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఏ కులం వారికైనా ఇది వర్తిస్తుంది. పదివేల పైన ర్యాంకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు తమ కుటుంబ ఆదాయం ప్రభుత్వం నిర్ణయించిన స్థాయికంటే తక్కువే ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే పూర్తి ఫీజును ప్రభుత్వం చెల్లిస్తుంది. పదివేల పైన ర్యాంకు వచ్చిన బీసీ విద్యార్థులకు రూ.35వేలు ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా చెల్లిస్తుండగా, మిగతా ఫీజును విద్యార్థులే భరించాలి. తాజా నిర్ణయం ప్రకారం సర్కారు కాలేజీల్లో చదివిన ఏ కులం విద్యార్థులకైనా ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రభుత్వ కాలేజీలతో పాటు, రెసిడెన్షియల్ స్కూళ్లు, గురుకులాలు, కార్పొరేట్ కాలేజీ స్కీమ్‌లలో లబ్ధిపొందిన విద్యార్థులకు కూడా ఈ పథకం వర్తించనుంది. వీరు కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం (మిగతా 6వ పేజీలో)



ప్యాలియేటివ్ కేర్‌కు ప్రత్యేక వార్డును సిద్ధం చేస్తున్న దృశ్యం

క్యాన్సర్ రోగులకు ప్రత్యేక వార్డు

- ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో 20 పడకలతో ఏర్పాటు
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం

ఖమ్మం కలెక్టరేట్, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిల్లాలో ఆరోగ్యమహిళ కేంద్రం ద్వారా క్యాన్సర్ బాధితులను గుర్తిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మెడికల్ కళాశాలల అనుబంధ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది. అందులో భాగంగా ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో 20 బెడ్లతో క్యాన్సర్ వార్డును సిద్ధం చేస్తున్నారు. గురువారం దీన్ని లాంఛనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో పాలియేటివ్ (ఆలన) సెంటర్‌లో క్యాన్సర్ బాధితులకు వైద్యసేవలను అందిస్తున్నారు. కీమో సెంటర్‌ను కూడా నిర్వహిస్తున్నారు. చివరి దశలో ఉన్న వారికి ఉపశమనం కలిగేలా ఈ సెంటర్‌లో వైద్యసేవలను అందిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఏడు పడకలు మాత్రమే ఉన్నాయి. దీనిని విస్తరించడంతో పాటు త్వరలో వయోవృద్ధుల కోసం కూడా మరో 20 పడకలతో వార్డును సిద్ధం చేయనున్నట్లు (మిగతా 6వ పేజీలో)


నేడు వైఎన్ పురంలో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ

» నందమూరి రామకృష్ణ రాక

కల్లూరు, మే14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యజ్ఞనారాయణపురంలో నందమూరి అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీ రామారావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం జరగనున్నదని నందమూరి అభిమానుల కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ విగ్రహాన్ని గ్రామస్థుల, నందమూరి అభిమానుల తరఫున రూ.3 లక్షల అంచనాతో నిర్మించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ చేత ఉదయం 10 గంటలకు ఈ విగ్రహ ఆవిష్కరణ జరగనున్నదని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎన్టీఆర్ ట్రస్టు మేనేజర్ టీడీ జనార్ధన్‌లతో పాటుగా పలువురు రాష్ట్ర, జిల్లా టీడీపీ నాయకులు, నందమూరి అభిమానులు రానున్నారని కమిటీ వారు వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లను పెంచటమే లక్ష్యంగా ప్రతిఒక్కరు పని చేయాలని ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యలో జరుగుతున్న మార్పులను పూర్తిగా అవగాహన చేసుకొని నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు ప్రయోజనం కలిగే విధంగా సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో సామినేని సత్యనారాయణ, మానిటరింగ్ అధికారి రవికుమార్, రామకృష్ణ, శైలజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సగం ధరకే పచ్చిరొట్ట విత్తనాలు

విక్రయ కేంద్రాల్లో సిద్ధంగా విత్తనాలు



ఎన్. బిక్షం, విత్తనాభివృద్ధి సంస్థ ప్రాంతీయమేనేజర్

రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలు ఉమ్మడి జిల్లాలోని 119 వివిధ రకాల విక్రయ కేంద్రాలలో సిద్ధంగా ఉన్నాయి. జీలుగు విత్తనం 40 కిలోల సంచికి రూ. 2,137, జనుము 40కిలోల సంచికి రూ.2,510గా, పిల్లి పెసర 20కిలోల సంచికి రూ. 2,055గా నిర్ణయించారు. ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో వ్యవసాయ శాఖ ఇచ్చిన ఇండెంట్ ఆధారంగా పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తెప్పిస్తున్నాం. ఇప్పటికే చేరకున్న జీలుగు, జనుము విత్తనాలను నిర్దేశిత కేంద్రాలకు పంపించాం. వాటిని 50 శాతం సబ్సిడీపై విక్రయించాలి.

» భూమికి శక్తినివ్వడంలో మేటి
» అందుబాటులో జీలుగు, జనుము, పిల్లి పెసర
» 5,422 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం
» జీలుగు విత్తనాలపై రైతుల ఆసక్తి

ఖమ్మం వ్యవసాయం, మే 14(ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ ముగియగా వచ్చే వానాకాలం సీజన్ కోసం ప్రభుత్వం సగం ధరకే పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఖమ్మంలోని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు విత్తనాల పంపిణీ ప్రారంభమైంది. అక్కడక్కడా కురుస్తున్న వర్షాలతో రైతులు దుక్కులు చేస్తున్నారు. ఈ క్రమంలో భూసారం పెంపునకు పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట విత్తనాలు చల్లి ఆపై కలియదున్నడం ఆనవాయితీ. ఈక్రమంలోనే వ్యవసాయ శాఖ జీలుగు, పిల్లి పెసర, జనుము తదితర పచ్చిరొట్ట పైర్ల పెంకానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఇందుకు అనుగుణంగా విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తోంది.

119 కేంద్రాల్లో విక్రయాలు

సహజసిద్ధమైన ఎరువు లభించేలా పచ్చిరొట్ట పంటల సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం.. విత్తనాలపై 50 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తోంది. కిలో రూ.142.75 ధర ఉన్న జీలుగు విత్తనాలను రూ.71.25కు, రూ.125.50 ధర ఉన్న జనుము విత్తనాలను రూ.62.75కు, రూ.205.50 ధర ఉన్న పిల్లి పెసర విత్తనాలను రూ.102.50కు విక్రయిస్తారు. ఖమ్మం జిల్లాలోని 75 పీఏసీఎస్‌లు, 13 ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, రెండు టీజీఎస్ డీఎల్, ఒక ట్రేడర్‌తో పాటు భద్రాద్రి జిల్లాలో 20 పీఏసీఎస్‌లు, ఏడు ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, ఒక ట్రేడర్ ద్వారా విత్తనాలను విక్రయానికి ఏర్పాట్లు చేశారు. రైతులకు సాధారణంగా జీలుగును సాగు చేయడానికి అధికంగా మొగ్గుచూపుతున్నారు. వారి అవసరాలకు అనుగుణంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిలాల్లో వ్యవసాయ శాఖ అధికారులను అందిన ఇండెంట్ ఆధారంగా పచ్చిరొట్ట విత్తనాలను విత్తనాభివృద్ధి సంస్థ సమకూరుస్తుంది. ఖమ్మం జిల్లాలో జీలుగు 14వేల క్వింటాళ్లు, జనుము 1,500 క్వింటాళ్లు, పిల్లిపెసర 150 క్వింటాళ్లు, భద్రాద్రి జిల్లాలో జీలుగు 5వేల క్వింటాళ్లు, జనుము 400 క్వింటాళ్లు, పిల్లి పెసర 50 క్వింటాళ్లకు కావాలని నివేదిక ఇచ్చారు. ఇందులో ఇప్పటివరకు జీలుగు 3,252 క్వింటాళ్లు, జనుము 1,170 క్వింటాళ్లు కలిపి 4,422 క్వింటాళ్ల విత్తనాలు తెప్పించారు.

పచ్చి రొట్టతో లాభాలు..

పచ్చిరొట్ట పైర్లను భూములలో కలియదున్నడం వలన భూసారం పెరుగుతుంది. భూమి బాగా గుల్లవారుతుంది. భూమిలో స్థూల సూక్ష్మ పోషకాల లభ్యత పెరుగుతుంది. తేమను ఎక్కువ రోజుల నిలుపుకొనే శక్తి వస్తుంది. సారవంతమైన నేలలను చౌడు భూములుగా మారకుండా నిలువరిస్తాయి. ఒక వేళ భూములలో ఏదైనా లవణాల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు తగ్గించి సారవంతంగా చేస్తాయి. పచ్చిరొట్ట ఎరువును పండించడానికి అవకాశం లేనప్పుడు పచ్చిరొట్ల చెట్ల ఆకులు, లేత కొమ్మలు బయటి నుంచి తెచ్చి పొలంలో వేసి కలియదున్నాలి. తగినంత నీరు పెట్టి కుళ్లనివ్వాలి.



ఇంకుడు గుంతను తవ్వుతున్న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్

పలుగు, పార చేతపట్టి...

» గుంతలు తవ్విన భద్రాద్రి కలెక్టర్ పాటిల్

సుజాతనగర్ మే 14 (ఆంధ్రజ్యోతి): సర్వారంలో ఇంకుడు గుంతల నిర్మాణం భేష్ అని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా సుజాతనగర్ మండలంలోని సర్వారం గ్రామ పంచాయతీలో ఇంకుడు గుంతల నిర్మాణాలను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. సర్వారం గ్రామ పంచాయతీలో యువకులు, గ్రామస్థుల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిశీలించి తాను కూడా పలుగు, పార చేత బట్టి ఇంకుడు గుంత నిర్మాణంలో తాను సైతం అంటూ పాల్గొన్నారు. ఇది గమనించిన గ్రామ యువత, గ్రామస్థులు కలెక్టర్ స్ఫూర్తితో ఇంకుడు గుంతల నిర్మాణాలను వేగవంతం చేశారు. దీనితో గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణాలు శరవేగంగా ఊపందుకున్నాయి. కలెక్టర్ ఇంకుడు గుంతలు నిర్మిస్తున్న యువకులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంకుడు గుంతల నిర్మాణం వలన మనం నిత్యం ఉపయోగించే నీటి లభ్యత పెరుగుతుందని, జిల్లాలోని యువత, గ్రామస్థులు ఇంకుడు గుంతల నిర్మాణంలో స్వచ్ఛందంగా పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కజ్జం సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైతే తొలగిస్తాం

» కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు

రుద్రంపూర్, (సింగరేణి) మే 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగంలో చేరి విధులకు గైర్హాజరవుతున్న వారిపట్ల సింగరేణి యాజమాన్యం కఠినంగా వ్యవహరిస్తుందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు హెచ్చరించారు. హాజరుశాతాన్ని బట్టి అవసరమైతే కార్మికులను సంస్థ నుంచి తొలగించేందుకు వెనుకాడే ప్రసక్తే లేదని ప్రకటించారు. బుధవారం కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీహెచ్‌పీ క్లబ్‌లో గైర్హాజరు కార్మికులకు, కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలని, కార్మికుల వారసులకు కారుణ్య నియామకాల ద్వార ఉద్యోగులు ఇస్తే విధులను నిర్లక్ష్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. కుటుంబసభ్యులు కార్మికుడ్ని విధులకు పంపే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. రానున్న మూడు నెలల్లో కార్మికుల హాజరుశాతాన్ని పరిశీలించి గైర్హాజరయ్యే కార్మికులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. గైర్హాజరుకు సంబంధించి ఎందుకు జరుగుతుందని కార్మికులను ప్రశ్నించారు. కారణాల పెట్టి తప్పించేకునే ప్రయత్నాలు చేయవద్దని, ఇచ్చితంగా విధులకు హాజరుకావాలని, లేని పక్షంలో యాజమాన్యం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. అనారోగ్యానికి గురైన పలువురు కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత వైద్యాధికారిని ఆదేశించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు కార్మికులను మెడికల్ బోర్డుకు పంపే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. విధులు నిర్వహిస్తే వేతనాలు వస్తాయని, వేతనాల ద్వారానే కుటుంబాలు ఆర్థిక, అభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జే. గట్టయ్య, ఎండీ రజాక్, ఎస్ఓటు జీఎం జీవీ. కోటిరెడ్డి, డీజీఎం (పర్సనల్) శివకేశవరావు, వీకే ఏజెంట్ రవీందర్, మేనేజరు ఎంవీఎస్. శ్యాం ప్రసాద్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పర్సనల్ అధికారులు హరీష్, గోవర్ధన్, మురళీ, దేవదాస్ పాల్గొన్నారు.



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

మెడికల్ బోర్డు అవకతవకలపై నిఘా

» విజిలెన్స్ అదుపులో నలుగురు సిబ్బంది
» ఒకరిపై బదిలీ వేటు
» నోరుమెదపని సింగరేణి అధికారులు

రుద్రంపూర్, (సింగరేణి) మే 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి మెడికల్ బోర్డులో జరిగిన అవకతవకలపై యాజమాన్యం కఠినంగా వ్యవహరిస్తోంది. మెడికల్ బోర్డు అవకతవకల్లో ప్రమేయం ఉన్న అధికారులపై మరింత నిఘా పెంచింది. గత వారం రోజుల క్రితం సింగరేణి మెయిన్ వర్క్‌షాపులో డ్రైవర్‌గా పని చేస్తున్న అన్నెబోయిన రాజేశ్వరరావును ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకోవడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పెరిగెత్తాయి. అవకతవకలపై విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. అవకతవకల్లో కీలక పాత్ర పోషిస్తున్నారనే నెపంతో సింగరేణి ప్రధాన కార్యాలయంలో కీలక విభాగంలో పని చేస్తున్న అధికారిని మణుగూరుకు బదిలీ చేశారు. సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో ఇరువురు సిబ్బందిని విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా సెంట్రల్ వర్క్‌షాపులో పని చేసే ఉద్యోగి పై మంగళవారం దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. అదుపులోకి తీసుకున్న సిబ్బందికి సంబంధించిన బ్యాంకు లావాదేవీలు, మెడికల్‌బోర్డులో పైరవీలు చేసే వ్యక్తుల సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఏసీబీ దాడుల్లో ఒకర్ని అరెస్టు చేయడం సింగరేణి వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. విజిలెన్స్ అధికారులు పలువర్ని అదుపులోకి తీసుకుని మరికొంతమంది ఫోన్లను స్వాధీనం చేసుకోవడంతో సింగరేణి ప్రధాన కార్యాలయంలో అలజడి కొనసాగుతోంది. వివరాలను తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా సమాచారం చెప్పేందుకు అధికారులు నోరుమెదపలేదు. ఏక్షణంలో ఏం జరుగుతుందోనని పైరవీకారుల అనుచర వర్గంలో భయాందోళకు గురవుతున్నట్లు ప్రచారం సాగుతోంది.



సింగరేణి ప్రధాన కార్యాలయం

దాడికి రెక్కీ అంటూ 100 కు కాల్

ఖమ్మం మే 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో తనపై దాడి చేసేందుకు కొందరు వ్యక్తులు రెక్కీ నిర్వహిస్తున్నారంటూ ఖమ్మం నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన ఓ వ్యక్తి డయల్ 100కు బుధవారం రాత్రి సమయంలో ఫిర్యాదుచేశారు. స్థానికంగా నివసించే రవి అనే వ్యక్తికి మరో ప్రముఖ వ్యక్తికి మధ్య ఆర్థిక వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో అయన ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న కొందరిని తాను గుర్తించినట్లు రవి తెలిపాడు. అనుమానించిన ఆయన కొంతసేపు వారిని పరిశీలించి డయల్ 100కు ఫిర్యాదుచేశాడు. దీంతో అప్రమత్తమైన ఖమ్మం టూటౌన్ పోలీసులు స్టేషన్ బ్లూకోల్ట్స్ పోలీసులు ద్వారకానగర్‌ను సందర్శించారు. రవితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

అభివృద్ధిలో రాజీ లేదు

(5వ పేజీ తరువాయి)

బాగుంటుందని, రైతులు మంచి పంటలు వేసి నష్టాలు లేని వ్యవసాయం చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. కార్యక్రమంలో ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్, మాజీ సర్పంచ్ బండి వెంకన్న, గాజుల రమేశ్, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, కొత్త కొమరయ్య, కేతినేని సీతరామయ్య, సుతగాని గోపయ్య, జీడిమట్ల రాముడు, బొడ్డుపల్లి కొండల్, పేరపాక సీతరాములు, ఎస్‌కే మహ్మద్ఆలీ, ఎస్‌కే మియా, ఎస్‌కే ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కాన్సర్ రోగులకు ప్రత్యేక వార్డు

(5వ పేజీ తరువాయి)

అధికారులు చెబుతున్నారు. దీనికోసం రూ.15 లక్షలతో వార్డును సిద్ధం చేశారు. గురువారం దీన్ని ప్రారంభించనున్నారు. ఖమ్మం జిల్లాలో 2018లోనే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల్లో మొత్తం ఇప్పటి వరకు 2,578 మంది ఇన్‌పేషంట్లుగా, 7,111మందికి ఔట్ పేషంట్లకు సేవలు అందించారు. ప్రత్యేక వాహనాల ద్వారా 23,098 మందికి పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ఆరోగ్యమహిళ కార్యక్రమంలో క్యాన్సర్‌ను గుర్తించేలా మోమోగ్రామ్ చేస్తున్నారు.

వీటిని మరింతగా విస్తరించి క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తించి వాటికి చికిత్సలు అందించాలన్న సదుద్దేశ్యంతో పాలియేటివ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ప్రారంభంతో జిల్లాలో క్యాన్సర్ బాధితులకు ఉపశమనం లభించనుంది.

ఆటో బోల్తా.. 8 మందికి గాయాలు

తల్లాడ, మే14(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై అడ్డొచ్చిన గేదెలను తప్పించబోయి అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో ఆటోలోని ఏడుగురుతోపాటు బైక్ పై ఉన్న మరో వ్యక్తి గాయపడ్డాడు ఈ సంఘటన బుధవారం తల్లాడ మండలం అంజనాపురం వద్ద తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిలో జరిగింది. తల్లాడ మండలం మిట్టపల్లి నుంచి తల్లాడ వస్తున్న ఆటోకు మార్గమధ్యంలో అంజనాపురం వద్ద గేదెలు అడ్డురావడంతో వాటిని తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణం హమాలీకాలనీకి చెందిన గుత్తికొండ జ్ఞానసుందరి, మౌనిక, సిరి, ఝాన్సీల తలకు, గొర్రెముచ్చు అరుణ, మాలోచి ఆరోగ్యమ్మ చేతులకు గాయలయ్యాయి. మణెమ్మ తీవ్రంగా గాయపడింది. ఈసమయంలో గెదేలు తగిలి బైక్‌పై వస్తున్న తల్లాడకు చెందిన మట్టగాని గురుపాదం రెండుకాళ్లకు గాయాలయ్యాయి. 108ద్వారా క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ కాలేజీలో ఇంటర్ చదివితే బీటెక్ ఫ్రీ

(5వ పేజీ తరువాయి)

ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. కుటుంబ వార్షికాదాయం ప్రభుత్వం నిర్ణయించిన స్థాయికి మించి ఉంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. ఎంసెట్ కౌన్సిలింగ్‌లో ప్రభుత్వం బీసీ, ఓసీ విద్యార్థులకు సరికొత్త పథకాన్ని అమలు చేస్తుండటంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దాంతో ఫీజుల భారంతో భయపడుతున్న విద్యార్థులకు ట్యూషన్ ఫీజు జీరో అని తెలియడంతో సంబురపడుతున్నారు.

వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇచ్చుకోవాలి

కౌన్సిలింగ్ తరువాత వెబ్‌ఆప్షన్లు పెట్టుకునే సమయంలో వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇచ్చుకోవాలి. విద్యార్థి ర్యాంకులకు సంబంధించి గత ఏడాది ఏఏ కళాశాలల్లో సీట్లు వచ్చాయో, ముందుగా తెలుసుకుని ఆప్షన్లు ఇచ్చుకోవాలి. వరుస క్రమాన్ని జాగ్రత్తగా రెండు, మూడురోజులు కేటాయించిన ఆప్షను సరిచూసుకుని అనంతరమే ఆప్షన్లు పెట్టుకోవాలి. ఆప్షన్లు పెట్టుకునే సమయంలో ల్యాప్‌టాప్ లేదా డెస్క్‌టాప్ కంప్యూటర్లు మాత్రమే వాడాలి. సెల్‌ఫోన్ల ద్వారా ఆప్షన్లకు ప్రయత్నిస్తే తప్పులు దొర్లే అవకాశం ఉంటుంది.

ఆప్షన్లను విద్యార్థి సొంత ఆలోచన ప్రకారం పెట్టాలే తప్ప మీసేవ, ఇంటర్‌నెట్ యజమానులకు సలహాలు తీసుకోకుడదు. సీట్ అలాట్‌మెంట్ జరిగిన తర్వాత ఆన్‌లైన్‌లో ఫీజును చెల్లించాల్సి ఉంటుంది దీనికి విద్యార్థి సొంత బ్యాంకు అకౌంట్ నుంచి ఫీజు చెల్లించాలిజ లేదా తల్లిదండ్రుల అకౌంట్ ద్వారా చెల్లించాలి. నెట్‌సెంటర్ల ద్వారా ఎట్టి పరిస్థితుల్లో ఫీజు చెల్లించకూడదు. విద్యార్థులకు ఏమైనా ఫీజులు తిరిగి వచ్చే అవకాశం ఉన్నప్పుడు అదే బ్యాంకు అకౌంట్‌కు అమౌంట్ వస్తుందని, కావున విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకుని వారి సొంత అకౌంట్ల ద్వారానే ఫీజులు చెల్లించాలి.

వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి

వేసవిలో ద్రవ పదార్థాలు ఆహారంగా తీసుకోవడమే మేలు ...
వడ దెబ్బకు గురైతే చికిత్స తప్పనిసరి
వేడి సంబంధిత వ్యాధులను గుర్తించాలి
జాగ్రత్తలు పాటిస్తేనే ఆరోగ్యం ....
డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడదెబ్బ తీవ్రతకు ఎంతోమంది అనారోగ్యానికి గురై ప్రతీ ఏడాది మరణాల రేటు నమోదవుతుంది. ప్రతి ఏడాది ఈ వేసవిలో 45 నుంచి 55 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుండడంతో ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు 50 డిగ్రీల అధికారికంగా నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. పెరుగుతున్న ఈ ఉష్ణోగ్రతలకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే వేడి సంబంధిత వ్యాధులు ముందస్తుగా తెలుసుకొని అరికట్టవచ్చని వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించింది.

ద్రవ పదార్థాలు ఆహారంగా తీసుకోవడమే మేలు

అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలందరూ దాదాపుగా ద్రవపదార్థాలని ఆహారంగా తీసుకుంటే వారి ఆరోగ్యాన్ని స్థిమితంగా ఉంచుకున్న వారవుతారు. సరిపడ ద్రవాలు తీసుకోవడం వలన మండుటెండల్లో జీర్ణ వ్యవస్థ సరిగా పని చేస్తుంది. అజీర్ణ లోపం ఉన్న వారికి ఈ ద్రవ పదార్థాలు సేవించడం వలన ఎటువంటి సమస్యలు కలగకుండా ఉండవచ్చు. దాహం వేయకపోయినా వీలైనప్పుడెల్లా తగినంత నీరు తాగి, డిహైడ్రేషన్ నుంచి తప్పించుకోవచ్చు. ప్రయాణాలు చేసే సమయంలో తాగు నీరు తమ వెంట తీసుకొని వెళ్ళాలని , ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా నిమ్మరసం, మజ్జిగ, పండ్ల రసాల, వంటితో పాటుగా ఇంట్లో తయారు చేసిన పానీయాలను కొద్దిగా ఉప్పు కలిపి త్రాగాలన్నారు. ముఖ్యంగా పుచ్చకాయ, కర్బూజా, ఆరెంజ్, ద్రాక్ష, పైనాపిల్, దోసకాయ, పాలకూర లేదా ఇతర స్థానికంగా లభించే పండ్లు కాయగూరలు వంటివి అధికంగా తీసుకోవాలని వీటిలో నీటి పరిమాణాలు అధికంగా లభ్యమవుతాయని ప్రకటించారు.

వడదెబ్బకు గురైతే చికిత్స తప్పని సరి


ఎవరైనా వడదెబ్బకు గురైతే వారికి చికిత్స తప్పని సరిగా అందించాలి. వారి పట్ల అశ్రద్ధ వహిస్తే అనారోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. వడ దెబ్బకు గురైన వారిని చల్లని ప్రదేశంలో తరలించి తాగునీరును అందించి శరీరం మొత్తం చల్లని నీటితో కలిపిన వస్త్రంతో తుడవాలి. అధిక శరీర ఉష్ణోగ్రత , ఏదైనా అపస్మారక స్థితిలో కానీ గందరగోళ పరిస్థితిలో ఆ వ్యక్తి ఉన్నట్లయితే లేదా చెమటలు పట్టకపోవడం ఎవరిలోనైనా కనిపిస్తే తక్షణమే ఆ వ్యక్తికి వీలైనంత గాలి తగిలేలా చర్యలు చేపట్టాలి . వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించాలి. లేని పక్షంలో 108 కానీ ఫోన్ చేసి సమాచారం అందించాలి.

వేడి సంబంధిత వ్యాధులను గుర్తించాలి

వేసవిలో ముందస్తుగానే వేడి సంబంధిత వ్యాధులను గుర్తించి అనారోగ్యానికి గురికాకుండా రక్షణ చర్యలను అవలంబించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. అనారోగ్యానికి గురైతే ఆ వ్యక్తిని చల్లని ప్రదేశానికి తరలించి స్వచ్ఛమైన తాగునీరు అందించాలి. వైద్య సహాయం కోసం స్థానికంగా ఉన్న వైద్యులను కానీ ఆసుపత్రి గాని సంప్రదించాలి. వేసవిలో అనారోగ్యానికి గురైన వారు తీవ్ర కండరాల కాళ్ళు, చేతులు, కడుపు నొప్పులతో బాధపడుతుంటారు. అదేవిధంగా వికారం, వాంతులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, మూర్ఛ, తలనొప్పి, చిరాకు ఇలాంటి లక్షణాలు కలిగిన వారికి ఎలక్ట్రోలైట్లను కలిగే ఉన్న ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్‌లను తాగిస్తే ఒక గంటలోపే వేడి తిమ్మిర్లు తగ్గే అవకాశాలు ఉన్నాయి. లేని పక్షంలో వైద్యులను సంప్రదించాల్సిందే.

జాగ్రత్తలు పాటిస్తేనే ఆరోగ్యం

భద్రాద్రి డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్



వేసవిలో వైద్య ఆరోగ్యశాఖ సూచించిన జాగ్రత్తలు, రక్షణ సూత్రాలు పాటిస్తే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారు. వీలైనంత వరకు ఇంట్లోనే ఉండేందుకు ప్రయత్నించాలి. ఏదైనా అత్యవసరం అయితేనే తప్ప బయటికి రావాలి. ఉదయం , సాయంత్రం వేళలోనే బయటి పనులు పూర్తి చేసేలా ప్రయాళికను రూపొందించుకోవాలి. ఎక్కు వ శాతం చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నం చేయాలి. సూర్యకాంతి పడని ప్రదేశంలో, వేడి గాలులు రాకుండా ఇంటి కిటికీలు, తలుపులు మూసివేసి ఉంచాలి. ప్రతీ ఒక్కరు బాధ్యతగా ఉంటేనే ఇంటిల్లిపాది వడదెబ్బ తగలకుండా ఉండగలుగుతారు.



'ఆంధ్రజ్యోతి లక్కీడ్రా' కారు విజేతకు

చెక్కు అందజేత



తాటి రాజశేఖర్‌కు చెక్కును అందజేస్తున్న దృశ్యం

(5వ పేజీ తరువాయి)

అభినందనీయమన్నారు. చెక్కు అందుకున్న విజేతలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ తాళ్లూరి పుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు కూడా బుక్ చేసుకున్నాం

విజేత శ్రీనివాసరావు, నాగేంద్ర

మాది వ్యవసాయ కుటుంబం. మాకున్న పది ఎకరాలతో పాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. ఎప్పటి నుంచో కారు కొనాలని అనుకుంటున్నా అది సాధ్యపడలేదు. మాకు కారు లేని లోటును 'ఆంధ్రజ్యోతి' తీర్చింది. గత మూడేళ్లుగా 'ఆంధ్రజ్యోతి' పత్రికను చదువుతున్నాను. లక్కీ డ్రాలో రాష్ట్రస్థాయిలో విజేతగా నిలవడం గొప్ప అనుభూతిని ఇచ్చింది. 'ఆంధ్రజ్యోతి' లక్కీ డ్రాలో గెలుపొందినట్టు ఫోన్ వచ్చిన తర్వాత కారు కూడా బుక్ చేసుకున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బంధువులు, స్నేహితులు ఫోన్లు చేసి అభినందిస్తుంటే చాలా సంతోషంగా అనిపించింది.

'ఆంధ్రజ్యోతి' చదివిన తర్వాతే దినచర్య

బైక్ విజేత తాటి వెంకటేశ్వర్లు

'ఆంధ్రజ్యోతి' దినపత్రిక చదివిన తర్వాతనే నా దినచర్య మొదలవుతుంది. లక్కీ డ్రాలో విజేతగా నిలిచావని, బైక్ బహుమతిగా వచ్చిందని ఫోన్ చేసినప్పుడు చాలా సంతోషం వేసింది. ఫోన్ వచ్చిన రోజును నేను ఎప్పటికీ మర్చిపోను. నా అభిమాన పత్రిక 'ఆంధ్రజ్యోతి'కి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

ప్రతి పేద కుటుంబానికి ఉచిత వైద్యం

(5వ పేజీ తరువాయి)

ప్రజా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అందించిందన్నారు. తమ ప్రభుత్వం ఖర్చు చేసిన ప్రతిపైసా లెక్కలను త్వరలో ప్రజల ముందు ఉంచుతామని తెలిపారు. ఎర్రుపాలెం మండల ప్రజల దశాబ్దాల కల సాకారమవ్వబోతుందని, 50పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణంతో మండలంలో ప్రతి నిరుపేద కుటుంబానికి నాణ్యమైన ఉచితవైద్యం అందుతుదని భట్టి విక్రమార్క తెలిపారు. అనంతరం రూ.2కోట్ల 62లక్షలతో కండ్రిక గ్రామం నుంచి పెద్దగోపవరం వరకు, రూ.5కోట్ల 74లక్షలతో బనిగండ్లపాడు నుంచి బంజర వరకు బీటీ రోడ్లకు భట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు, ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, డీఎంహెచ్‌వో కళావతిబాయి, ఆర్డీవో నరసింహారావు, తహసీల్దార్ మన్నె ఉషాశారద, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మధిర మార్కెట్ కమిటీచైర్మన్ బండారు నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో చిరుతపులి కలకలం

ఆనవాళ్లు లభించలేదని తెలిపిన అటవీ అధికారులు



పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

అశ్వారావుపేట , మే 14(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో బుధవారం చిరుతపులి సంచారం కలకలం సృష్టించింది. పులి సంచారం అనే ప్రచారంతో సమీపంలోని ప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. అయితే పులిసంచారానికి సంబంధించిన ఆనవాళ్లు లభించలేదని అటవీశాఖ అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే అశ్వారావుపేటలోని నందమూరినగర్ సమీపంలో గల కొబ్బరితోట వద్దకు యజమాని వెంకట్రామారావు ఉదయం వెళ్లారు. పొదల మధ్య ఓ జంతువు ఉండటం, చిరుతపులి మాదిరిగా ఉండటంతో వెంటనే రైతు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. రేంజర్ మురళీ ఆధ్వర్యంలో సిబ్బంది తోటలోకి వెళ్లి చిరుతపులి పాదముద్రల కోసం వెతికారు. అయితే అంతకుముందే వర్షం పడటంతో ఆనవాళ్లు పెద్దగా కనిపించలేదు. అటవీ అధికారులు దాదాపు రెండు కిలోమీటర్ల పాద ముద్రలు ఉన్నాయామోనని పరిశీలన చేశారు. సరైన అనవాళ్లు లేకపోవటంతో వచ్చిన జంతువు చిరుత పులి కాదని నిర్ధారించారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని రేంజర్ మురళీ కోరారు.

ఆవులను తరలిస్తున్న ఆటో బోల్తా

భద్రాచలం, మే 14(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఆవులను తరలిస్తున్న ట్రాలీ ఆటో బోల్తా పడిన ఘటన బుధవారం తెల్లవారుజామున సమయంలో అయప్ప కాలనీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం....భద్రాచలం పట్టణంలోని అయప్ప కాలనీ సమీపంలో ఆవులను తరలిస్తున్న ట్రాలీ ఆటో బోల్తా బుధవారం తెల్లవారుజామున సమయంలో పడింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ, పోలీసుశాఖల అధికారులు, సిబ్బంది ఘటన స్థలం వద్దకు చేరుకుని ట్రాలీలో ఉన్న ఆవులను బయటకు తీశారు. ప్రమాదం సమయంలో ట్రాలీలో తొమ్మిది ఆవులను తరలిస్తున్నట్లు గుర్తించారు. ట్రాలీలో పరిమితికి మించి ఆవులను తాళ్లతో బంధించి తరలిస్తుండగా ప్రమాదంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంతో బాధ్యులు పరారయినట్లు తెలుస్తోంది. ఆవులను పరిమితికి మించి అనుమతులు లేకుండా చర్ల నుంచి పాల్వంచనకు తరలిస్తున్నట్లు సమాచారం. ఒక వ్యక్తిని పాల్వంచ అదుపులోకి తీసుకున్నట్లు వినికిడి. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కరకట్టపై నుంచి ట్రాలీ ఆటో బోల్తా పడగా కరకట్ట దిగువన ఉన్న ఇళ్లపై పడకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిపై విచారణ

ఇల్లెందురూరల్, మే14 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలం మర్రిగూడెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ధారవత్ రమేష్‌పై గ్రామస్తుల ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు విచారణ చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు టేకులపల్లి ఎంఈవో జగన్ బుధవారం విచారణ చేశారు. 2018 నుంచి మర్రిగూడెం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రమేష్ విధులకు గైర్హాజరవుతున్నాడని, పాఠశాల అభివృద్ధి నిధులలో అవకతవకలకు పాల్పడ్డాడని, పాఠశాలకు వచ్చిన రోజు సైతం విద్యార్థులకు పాఠాలు బోధించడంలేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో గ్రామస్థులు కలెక్టర్, ఐటీడీఏ పీఓ, డీఈవోకి ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడు తరుచు విధులకు హాజరుకాకపోవడంతో గ్రామస్థులు తమ విద్యార్థులను ఇతర ప్రాంతంలోని పాఠశాలలో చేరారని, ప్రస్తుతం 5గురు విద్యార్థులే ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.గతంలోను రమేష్‌పై వచ్చిన ఆరోపణలపై స్థానిక ఎంఈఓ విచారణ చేసి జిల్లా అధికారులకు అందించారు.ఈ విషయంపై విచారణ అధికారి టేకులపల్లి ఎంఈఓ జగన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాను విచారణ చేస్తున్నట్లు, విచారణ నివేదికను వెల్లడించవద్దని పై అధికారులకు అందజేస్తానని వివరించారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



ఖమ్మం సంక్షేమ విభాగం, మే 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్ విమర్శించారు. బుధవారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో కేఎంసీ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, చేయూత నూతన పింఛన్లు మంజూరు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు జానిమియా, యర్రా బాబు, శింగు నర్సింహారావు, పోటు కళావతి, బీజీ క్లైమెట్, మహ్మద్ సలామ్, తోట రామాంజనేయులు మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, యానాలి సాంబశివరెడ్డి, జ్వాలా నర్సింహారావు, నానబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాన్య ప్రజలకు ఎండలో తిప్పలు

కేఎంసీ కార్యాలయం ముట్టడి సందర్భంగా సీపీఐ నాయకులను కేఎంసీలోకి అనుమతించిన పోలీసులు, సాధారణ ప్రజల్ని మాత్రం గేటు ఎదుట ఎండలో నిలబెట్టారు. కేఎంసీలో చేయూత పింఛన్లు, మీసేవ తోపాటుగా పలు దరఖాస్తులు మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసేందుకు వచ్చిన ప్రజలు ఇబ్బంది పడ్డారు. తాము నిరసనకు రాలేదని ఎందుకు లోపలికి పంపటం లేదని పోలీసు సిబ్బందిని ప్రశ్నించారు.

యువ వికాసం ఆర్జీదారులకు 'సిబిల్' పాట్లు

బ్యాంకుల నుంచి వివరాలు పొందాలంటున్న అధికారులు

'సిబిల్' సమాచారం అవసరం లేదన్న డిప్యూటీ సీఎం

అయోమయంలో పథకం దరఖాస్తుదారులు

దుమ్ముగూడెం మే 14 (ఆంధ్రజ్యోతి): మండల రాజీవ్ యువ వికాసం పథకం ఆశావాహులకు సిబిల్‌స్కోర్ పాట్లు ఎదురయ్యాయి. పథకంలో లబ్ధిపొందేందుకు మండల వ్యాప్తంగా మొత్తం 2,436 మంది దరఖాస్తు చేశారు. వీరిలో ఎస్సీలు 425, బీసీలు 446, ఎస్టీలు 1502, ముస్లిం మైనారిటీలు 19, క్రిస్టియన్ మైనారిటీలు ఏడుగురు, ఈబీసీ నుంచి 37 మంది దరఖాస్తు చేశారు. రుణాలను అందించేందుకు నిర్ణయించిన బ్యాంకులనుంచి సిబిల్ స్కోరు వివరాలు పొందాలని పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తుదారులకు సమాచారమిచ్చారు. ఐతే బుధవారం మధ్యాహ్నం వరకు సిబిల్‌స్కోరు వివరాలిచ్చిన లక్ష్మీనగరం ఎస్బీఐ బ్యాంకు సిబ్బంది కొంతసేపటి తర్వాత వ్యక్తిగతంగా ఇవ్వమని తేల్చిచెప్పారు. బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాము సిబిల్ వివరాలు ఇవ్వడం లేదని తెలిపారు. దీంతో అవసరమైన జిరాక్స్ పత్రాలతో బ్యాంకు ముందు పడిగాపులు కాసిన దరఖాస్తుదారులు చేసేదేమీలేక మండల పరిషత్ కార్యాలయానికి పరుగులు తీశారు. ఈ నెల 13న ఇల్లెందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ యువవికాసం పథకానికి సిబిల్‌స్కోరు అవసరం లేదని ప్రకటించారు. దీనికి సంబంధించిన జీవో తమకు రాలేదని, సిబిల్‌స్కోరు వివరాలు తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది చెపుతుండడంతో యువవికాసం లబ్దిదారులు అయోమయానికి గురయ్యారు. అటు బ్యాంకులు, ఇటు మండల పరిషత్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ విషయమై ఎస్బీఐ మేనేజర్ ప్రవీణ్‌ను వివరణ కోరగా సిబిల్ స్కోరు వివరాలు వ్యక్తిగతంగా ఇవ్వడం సాధ్యపడదని ఎంపీడీవో కార్యాలయం నుంచి దరఖాస్తుదారుల వివరాల జాబితా తమకు పంపితే అందరికీ ఒకేసారి ఇస్తామని తెలిపారు. సిబిల్‌స్కోరు పరిశీలనతో తొంభైశాతం మంది రుణం పొందే అవకాశం కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సాయిబాబు మాట్లాడుతూ కలెక్టర్ స్వయంగా తయారు చేసిన ప్రొఫార్మాలో దరఖాస్తుదారుల వివరాలను నింపి బ్యాంకులకు పంపుతామన్నారు. జీవో కార్యాలయానికి రాలేదన్నారు.

విద్యార్థుల పెంపునకు కృషిచేయండి

వృత్యంతర శిక్షణలో భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జితేష్ వి పాటిల్

కొత్తగూడెం అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచే దిశగా ఉపాధ్యాయులు కృషిచేయాలని, నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యంగా ఉపాధ్యాయులు విధులు నిర్వహించాలని కలెక్టర్ జితేష్ విపాటిల్ ఉపాధ్యాయులకు, జిల్లా విద్యాశాఖ అధికారులకు దిశానిర్దేశ్యం చేశారు. బుధవారం జిల్లా విద్య శిక్షణ కేంద్రంలో జిల్లాస్థాయి వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించిన కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తాము అనుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు నాణ్యమైన విద్యను అందించడమే మార్గమని అన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయం లేదన్నారు. ప్రభుత్వం వృత్యంతర శిక్షణ కార్యక్రమాల ద్వారా నాణ్యమైన విద్యా బోధన, వచ్చే విద్యా సంవత్సరంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని తరగతి గదిలో వినియోగించడంతో పాటు నూతన విద్యావిధానంలో విద్యా బోధన పద్ధతులను తెలియజేసేందుకు వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని, వసతుల కల్పనలో ఏమైనా అభ్యంతరాలుంటే జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియజేయాలని, సాధ్యమైనంతవరకు ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించడంలో ఉపాధ్యాయులకు ఎవరూ ప్రత్యామ్నాయం కాదని, మీరంతా సర్వశక్తిమంతులని ప్రభుత్వ విద్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ శక్తివంచన లేకుండా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో యం. వెంకటేశ్వరచారి, ఎంఈవోలు నాగరాజశేఖర్, ఎస్.సతీష్‌కుమార్, జిల్లారిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో అయిదుగురికి గాయాలు



కోతుల దాడిలో గాయపడిన మహిళలు

కొణిజర్ల, మే14 (ఆంధ్రజ్యోతి): అయిదుగురు మహిళలపై కోతులు దాడి చేసి గాయపరిచిన సంఘటన మండల పరిధిలోని వైరా మునిసిపాలిటి దిద్దుపుడి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామంలో ఇంటి ముందు, రోడ్ల వెంట వెళ్లుతున్న ప్రజలపై కోతులు దాడి చేస్తున్నాయి. ఈక్రమంలో గ్రామానికి చెందిన షేక్ లాల్‌బి, అమీనాబి, రజియాబేగం, నిజాంబి, అమర్లపుడి సైదమ్మలను కోతులు దాడి చేసి గాయపరిచాయి. బాధితులు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వ్యాక్సిన్ వేపించుకున్నారు. గ్రామస్తుల ఆవేదన మేరకు వైరా మునిసిపల్ కమీషనర్ వేణు గ్రామంలోకి వచ్చి బాధితులను పరామర్శించారు. కోతులదాడి గురించి తెలుసుకున్నారు. రోడ్లవెంట నడుస్తూ వెళ్లుతున్న వారిపై కోతులు దాడి చేస్తున్నాయని, కోతులను నివారించాలని బాధితులు కోరారు. పట్టించుకోకపోతే ఇంకా ఎంతమందిని గాయపరుస్తాయోనని స్థానికులు కమీషనర్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల గోడు విన్న కమిషనర్ నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు కౌన్సిలర్ సురేష్ పాల్గొన్నారు.

రికవరీ చేసిన ఫోన్లు అందజేసిన ఎస్పీ



ఫోన్లు పొందిన వారు..

కొత్తగూడెం, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్ల పరిధిలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ద్వార రికవరీ చేసి తిరిగి వారికి అందచేయడం జరిగిందని ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సీఈఐఆర్ పోర్టల్ ద్వార అందుకున్న ఫిర్యాదులతో బాధితులు కోల్పోయిన మొబైల్ ఫోన్లను కనిపెట్టడం జరిగిందన్నారు. గత రెండు నెలల వ్యవధిలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న 150మంది బాధితులకు బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో తిరిగి వారి ఫోన్లను అప్పగించడం జరిగింది. మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు వెంటనే సీఈఐఆర్‌పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా అడిగిన అన్ని రకాల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకుంటే సంబంధిత పోలీస్‌స్టేషన్ నుంచి తిరిగి వారి మొబైల్‌ఫోన్లను ట్రాక్ చేసి కనిపెట్టడం జరుగుతుందని తెలిపారు.ఎవరైన తమ మొబైల్ దొంగలించబడిన, పోగొట్టుకున్న వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వార తిరిగి వారి మొబల్‌ఫోన్లను పొందవచ్చునని తెలిపారు గడిచిన ఐదు నెలల కాలంలో మొత్తం 743మొబైల్ ఫోన్లను కనిపెట్టి బాధితులకు అందచేయడం జరిగిందని తెలిపారు. పోర్టల్ ద్వారా తిరిగి పోగొట్టుకున్న తమ మొబైల్‌ఫోన్ వివరాలను పొందుపర్చి ఫిర్యాదు చేయగలిగితే ఆ ఫోన్లను సులభంగా కనిపెట్టవచ్చని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను అవతల వ్యక్తి వినియోగించాలని ప్రయత్నించినప్పుడు మాత్రమే ఆ మొబైల్‌ను ట్రేస్ చేయగలమని ఎస్పీ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా బాధితుల మొబైల్ ఫోన్లను కనిపెట్టి వారికి అందచేయడంలో కృషి చేసిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అనంతరం వారికి ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఐటీసెల్ ఇంచార్జీ సీఐ రాము, ఎస్ఐ సురేష్, ఐటీ సెల్ సభ్యులు నవీన్, నరేష్, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం..దైన్యం



సోములగూడెంలో కొనుగోలు కేంద్రం

- అకాల వర్షాలతో అన్నదాతకు కన్నీళ్లు
- కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు నిల్
- భద్రాద్రి జిల్లాలో మూడు మిల్లులకే ధాన్యం కేటాయింపు
- తరలింపులో తీవ్ర జాప్యంతో నష్టపోతున్న రైతులు

పాల్వంచ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): రైతులు రబీ4 సీజన్‌లో వేసిన వరి చేతికి వచ్చిన దశలో అకాల వర్షాల వల్ల కుదేలయ్యారు. కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు లేక ధాన్యం రాసులు తడిశాయి. సకాలంలో కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని కాటాపెట్టి తరలించడం లేదని రైతులు వాపోతున్నారు. జిల్లా మొత్తం మీద మూడు బాయిల్ రైస్‌మిల్లులకే ధాన్యం ఎత్తడం వల్ల లారీల సమస్య తలెత్తుతోంది. పౌరసరఫరాల శాఖాధికారులు అన్ని రైస్ మిల్లులకు రైతుల ధాన్యాన్ని తరలించే విధంగా ముందస్తుగా చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపిస్తోన్నారు. బుధవారం కురిసిన వర్షానికి పాల్వంచ మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని రైతులు ధాన్యం రాసులు తడిసాయి. దీంతో రైతులు నష్టాన్ని చవి చూశారు

జిల్లా వ్యాప్తంగా ఈ రబీ సీజన్‌లో రైతులు 72వేల ఎకరాల్లో వరివేశారు. గోదావరి, కిన్నెరసాని, ముర్రేడ పరివాహక ప్రాంతాల్లో వరి విస్తారంగా వేయడం జరిగింది. రైతులు వేసిన వరి చేతికి అందే సమయంలో అకాల వర్షాలు రైతులను నిరాశ పరిచాయి. కోత దశలో కురిసిన వర్షాల వల్ల వరి నీటిలో తడిచి వరి కొంతమేరకు దెబ్బతిన్నది. ఆ తర్వాత మిషన్ల ద్వార వరి నూర్పిడి చేసి ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని రైతులు తరలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు లేకపోవడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం రాసులపై కప్పే పరదాలు రైతులకు పూర్తిస్థాయిలో అధికారులు సమకూర్చలేదు. కొనుగోలు కేంద్రాల వద్ద విద్యుత్ సౌకర్యం కూడ లేని పరిస్థితి ఏర్పడింది. నేలపైనే ధాన్యం రాసులు పోయడ వల్ల వర్షాలకు తడిసి మొక్కలు వచ్చిన పరిస్థితి ఇక్కడ నెలకొంది. రైతులు ఈ రబీలో ఎకరానికి సుమారు రూ.20వేల నుంచి రూ.25వేల వరకు పెట్టుబడులు పెట్టారు. కౌలు రైతులకు ఇంకా అధికం ఖర్చులయ్యాయి. ఎకరానికి 35నుంచి 40బస్తాల వరకు దిగుబడి వస్తోందని అంచనాలు వేస్తోన్నారు. ముదుగులు, సన్నాలు ఈ ప్రాంతంలో ఎక్కువగా వేశారు. అయినప్పటికీ దిగుబడి అనుకున్న స్థాయిలో రాకపోవడం అకాల వర్షాలకు వరి తడవడం, గింజ నలుపు రంగులోకి చేరడంతో ధర అనుకున్నంత స్థాయిలో పెరగలేదు. ప్రభుత్వం క్వింటాకు ముదుగులు రూ.2,300 చెల్లించగా సన్నాలకు రూ.2320ల ధరను నిర్ణయించింది. అయితే తడిచిన ధాన్యానికి రేటు తగ్గించడం వల్ల రైతులకు ప్రభుత్వ ధర కూడ అందకుండ పోయింది. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి అమ్ముకునేందుకు తగు ఏర్పాట్లను అధికారులు చేయడంలో విఫలమయ్యారు.

ఆ మూడు మిల్లులకే సరఫరా..

జిల్లాలో 72వేల ఎకరాల్లో పండించిన వరి ధాన్యం బూర్గంపాడు, సుజాతనగర్, ఇల్లెందుల్లోని బాయిల్డ్ రైస్‌మిల్లులకు మాత్రమే సరఫరా చేస్తున్నారు. పౌరసరఫరాలశాఖ అధికారులు జిల్లాలోని బాయిల్డ్ రైస్‌మిల్లులతోపాటు చిన్న రైస్ మిల్లులకు కూడ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నట్లైతే రైతులధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ఉండే పరిస్థితి ఉండదు. బాయిల్డ్ రైస్‌మిల్లులకే తరలిస్తుండటం వల్ల జిల్లాలోని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాసులు నిల్వ ఉంటున్నాయి. దీని వల్ల అకాల వర్షాలతో ధాన్యం తడిచి రైతులకు నష్టం జరుగుతుంది. అధికారులు ముందు చూపుగా ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి రైతుల ధాన్యాన్ని కాటా పెట్టించి త్వరితగతిన మిల్లులకు సరఫరా చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాలతో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియకకి బిక్కుబిక్కుమంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాలంగా కురిసే వర్షాలతో తాము ఇబ్బందులు పడుతున్నామని చెపుతున్నారు. ఎప్పుడు ఏమి జరుగుతుందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌ల సస్పెన్షన్

పాల్వంచ, చంద్రుగొండ మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలను అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్‌రావు సస్పెన్షన్ చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతపై పీపీసీ ఇన్‌చార్జీలు నిర్లక్ష్యంగా వ్యవహరించారని రైతుల నుంచి ఆరోపణలు వచ్చినట్లు పేర్కొన్నారు. సరైన సౌకర్యాలు కల్పించకపోవడం కూడ కొంత జాప్యం చేశారని తెలిపారు. మిల్లర్స్ సైతం రైతులకు సహకరించకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇద్దరు కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలను సస్పెండ్ చేసి సంబంధిత సహకార పీపీసీ కార్యాలయాలకు ఉత్తర్వులు జారీ చేశారు.

క్రైం సమాచారం

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పెనుబల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంతో మంచంలోనే ఉంటున్న వృద్ధుడు బీడీ కాల్చుకునేందుకు అగ్గిపుల్ల వెలిగించగా ప్రమాదవశాత్తూ మంచంపై పడి శరీరానికి అంటుకోవడంతో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందిన సంఘటన మండలంలోని లింగగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గరికా నాగయ్య(85)ఈనెల ఆరోతేదీన మధ్యాహ్నా సమయంలో బీడీ కాల్చుకుంటుండగా మంచంపై అగ్గిపుల్ల పడి శరీరానికి నిప్పంటుకొంటుంది. అతడ్ని పెనుబల్లి ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి బంధువులు ఫిర్యాదు చేయడంతో వీఎంబంజర్ ఎస్ఐ కె.వెంకటేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి...

ద్విచక్రవాహనంపై నుంచి పడి తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కల్లూరు మండలం రఘునాథగూడెం గ్రామానికి చెందిన రామిశెట్టి రామారావు(45) గతనెల 24న టేకులపల్లి గ్రామంలో ధాన్యాన్ని కొనుగోలు చేసి రాత్రి పదిగంటల సమయంలో ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. అతడ్ని పెనుబల్లి ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు వీఎంబంజర్ ఎస్ఐ కె.వెంకటేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సత్తుపల్లి, మే14 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం సిద్దారాం గ్రామానికి చెందిన ఆర్ రామారావు (39) ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకున్న సంఘటన బుధవారం వెలుగు చూసింది. ఈ సంఘటనకు సంబంధించి మృతుని సోదరుడు ఆదినారాయణ సత్తుపల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రామారావు తన భార్య మరో వ్యక్తితో ఉన్న గొడల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లి పోయింది. దీంతో రామారావు మంగళవారం తన ఇంటి ఆవరణలోని మామిడి చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతదేహంను గుర్తించిన కుటుంబ సభ్యులు సత్తుపల్లి పోలీసులకు సమాచారం అందించటంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

అశ్వాపురం మే14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లెలమడుగు జెడ్పీ హైస్కూల్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. వెంకటాపురం గ్రామపంచాయతీ సాయిబులగుంపుకు చెందిన జమీర్ సారపాక నుంచి బైక్‌పై మొండికుంట వస్తున్నాడు.మార్గమధ్యంలో జెడ్పీహైస్కూల్ మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరోబైక్ ఢీకొనటంతో జమీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్సు ద్వారా చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

2.4కిలోల గంజాయి స్వాధీనం

వైరా, మే 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం నుంచి ఖమ్మానికి అక్రమంగా రవాణా చేస్తున్న 2.4కిలోల గంజాయిని బుధవారం వైరాలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. భద్రాచలం నుంచి కారులో ఖమ్మం వైపు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో వైరాలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ నిర్వహించారు. 2.4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న ఐదుగురు యువకుల్లో కోటేశ్వరరావు, సందీప్, అజయ్, సాయివంశీని అదుపులోకి తీసుకోగా మరో యువకుడు రామకృష్ణ పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

పెనుబల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకులపల్లి గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న కోట ప్రభాకర్‌కు చెందిన మామిడితోటలో దుర్వాసన వస్తుండటంతో పంచాయతీ కార్యదర్శికి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి పుష్పరాణి తనిఖీ చేయగా ప్రభాకర్‌కు చెందిన మామిడితోటలో జంతు కళేబరాలు ఉన్నాయని గుర్తించారు. కోట ప్రభాకర్‌పై పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు వీఎంబంజర్ ఎస్ఐ కె.వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడ్స్‌రైలు ఢీకొని అడవిదున్న మృతి

అశ్వాపురం మే14 (ఆంధ్రజ్యోతి): అశ్వాపురం అటవీరేంజ్ పరిధిలోని జగ్గారం బీట్ ఎర్రబొక్కల చెరువు అటవీప్రాంతంలో మంగళవారం రాత్రి రైల్వే ట్రాక్ సమీపంలో అడవిదున్న మృతిచెందింది. రాత్రివేళ అడవిదున్న ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొన్నట్లు అటవీఅధికారులు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్నిబుధవారం అశ్వాపురం రేంజర్ సిద్ధబోయిన రమేష్ సందర్శించి ప్రమాదం వివరాలు సేకరించారు. అనంతరం పశువైద్యాధికారి రుబీనాపర్వీన్ సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

పిడుగుపాటుకు పాడిగేదె మృతి

పినపాక, 14 మే (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా బుధవారం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పిడుగుపాటుకు గురై ఓ పాడిగేదె మృతి చెందింది. గడ్డంపల్లి గ్రామానికి చెందిన గిరిజన మహిళా రైతు గొంది మాణిక్యమ్మకు చెందిన పాడిగేదె మృతి చెందడంతో కన్నీటి పర్యంతమైంది. సుమారు రూ, 50 వేలు విలువ చేసే పాడిగేదె మృతి చెందడంతో తన జీవనాధారం పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం తనను ఆదుకొని, తనకు జీవనాధారం కల్పించాలని అధికారులను వేడుకుంది.

సైబర్ వలకు చిక్కిన వివాహిత

దుమ్ముగూడెం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి పైడిగూడెంకు చెందిన జీవీవెన అనే వివాహిత సైబర్ వలకు చిక్కి రూ.76వేలు పోగొట్టుకుంది. ఆలస్యంగా గమనించిన బాధితురాలు సైబర్‌క్రైం విభాగానికి ఫిర్యాదు చేసింది. 2024 జనవరి 30న తన బ్యాంకు ఖాతా నుంచి రూ.76వేల నగదు మాయమైనట్లు గుర్తించింది. తాజాగా బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేద్దామని అనుకోగా నగదు డ్రా అయి ఉన్నాయి. దుమ్ముగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జూలూరుపాడు, మే 14(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని సీజ్ చేసి ఆరుగురిపై కేసు నమోదు చేశారు. బుధవారం ఎస్సై బాదావత్ రవి తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని బేతాళపాడు పంచాయతీకి చెందిన ఆంగోత్ సక్రు, కోరం నానయ్య, బల్లెం రంగయ్యలు ట్రాక్టర్ యాజమానులు తమ ట్రాక్టర్లలో డ్రైవర్లు బానోత్ బిక్కు, బానోత్ నిఖిల్, సోడె వెంకన్నలతో కలసి బేతాళపాడు గ్రామ శివారులోని పెద్దవాగులో కూలీల చేత ఇసుకను విక్రయించేందుకు ట్రాక్టర్లలో లోడు చేస్తున్నారు. ఈ క్రమంలో తమ సిబ్బంది మంగళవారం అర్ధరాత్రి దాడులను నిర్వహించి ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

దమ్మపేట, మే14(ఆంధ్రజ్యోతి): దమ్మపేట మండలం బాలరాజుగూడెం గ్రామ శివారులలో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ దమ్మపేట పోలీసులు సంయుక్తంగా బుధవారం సాయంత్రం దాడి చేశారు. ఈ ఘటనలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.17,500 నగదు, ఐదు ద్విచక్రవాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరొక వ్యక్తి పరారైనట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

దమ్మపేట, మే14 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అంకంపాలెం గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అంకంపాలెం గ్రామంలో పాఠశాలకు ఎదురుగా విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ బాగా కిందకు ఏర్పాటు చేయగా కొర్సా పుల్లయ్యకు చెందిన ఎద్దు మేత మేసేందుకు అటుగా వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగలి విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. బాధిత రైతుకు విద్యుత్ శాఖా అధికారులు నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఆడపిల్ల ఇంటికి వెలుగు: జేడీఏ

తిరుమలాయపాలెం, మే14(ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల ఇంటికి వెలుగని, ఆడపిల్ల పుడితే అదృష్టంగా భావించాలని జేడీఏ పుల్లయ్య చెప్పారు. బుధవారం మండలంలోని బచ్చోడులో మాఇంటి మణిదీపంలో భాగంగా తాటికొండ భానుశ్రీ-అశోక్‌చారి దంపతులకు ఇటీవల ఆడపిల్ల జన్మించింది. ఈసందర్భంగా ఆ దంపతులను జేడీఏ ఘనంగా సన్మానించారు. ఆడపిల్ల పుడితే భారంగా కాకుండా వరంగా భావించాలన్నారు. పురుషులకు దీటుగా మహిళలు రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఏవో నారెడ్డి సీతారాంరెడ్డి, ఏఈవో రమేష్, సీడీపీవో ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా అండర్ డ్రెయినేజీ

- మరో వారంలో పైప్‌లైన్ నిర్మాణం పూర్తి కావాలి
- కమిషనర్ అభిషేక్ అగస్త్య



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం, మే14(ఆంధ్రజ్యోతి): మహానగారాలకు దీటుగా ప్రకృతి విపత్తులను తట్టుకునేలా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖమ్మంలో అండర్ డ్రెయినేజీ వ్యవస్థను నిర్మాణం జరుగుతోందని నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. ఈ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అల్లీపురం నుంచి ఫైవ్ ఎలిమెంట్స్ వరకు, మమతా రోడ్డు, లకారం ట్యాంక్ బండ్ వద్ద పనులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్‌కుమార్‌కు పలు ఆదేశాలిచ్చారు. ఖమ్మంలో ఖానాపురం చెరువు నుంచి 8కీమీ దూరం వరకు అండర్ డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణం చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు పైప్‌లైన్ నిర్మాణానికి తుది మెరుగులు దిద్దాలన్నారు. మిగిలిన రెండు కిలోమీటర్ల దూరాన్ని వారం రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం లోపుగా ఖమ్మం నగరంలో నిర్దేశించిన 8కీమీ అండర్ డ్రెయినేజీ వ్యవస్థ అందుబాటులోకి రావాలన్నారు. కావాల్సిన మేరకు అదనంగా యంత్రాలు రప్పించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రతీ ఒక్కరూ స్వశక్తితో ఎదగాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- 70 మంది యువతులకు సర్టిఫికెట్ల ప్రదానం



కలెక్టర్‌తో శిక్షణ పొందిన మహిళలు

ఖమ్మంరూరల్, మే14(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు స్వశక్తితో ఎదిగేందుకు కృషితో పట్టుదలతో ముందుకుసాగాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని తరుణిహట్‌లోని ఎస్‌బీఐ ఆధ్వర్యంలోని రైసెట్‌లో వివిధ కోర్సుల్లో శిక్షణపొందిన 70 మంది యువతులకు బుధవారం సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. నేటి పోటీ ప్రపంచంలో యువత వారికి నచ్చిన కోర్సుల్లో శిక్షణ పొంది వాటిపై ఆదాయాన్ని పొందాలన్నారు. తద్వారా మరో నలుగురికి ఉపాధి చూపించేలా తయారు కావాలని సూచించారు. వివిధ కోర్సులలో శిక్షణ పొందిన వారికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రభుత్వం కూడా యువతకు ప్రాధాన్యమిస్తోందన్నారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సెటి డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపిడి నూరోద్దీన్, సీఎస్‌సి కోఆర్డినేటర్ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ

- పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే...
- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు



మాట్లాడుతున్న హేమంతరావు

నేలకొండపల్లి, మే14(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ కులాలు,మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నదని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తీవ్రంగా విమర్శించారు. బుధవారం నేలకొండపల్లిలోని కర్నాటిభవన్‌లోజరిగిన మండల సీపీఐ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. రైతుసంఘం మండల కార్యదర్శి ఫాల్తియా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ పేదల పక్షాన పోరాడేది ఒక్క కమ్యూనిస్టులేనన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలవుతున్నా పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. మోదీ ప్రభుత్వంలో కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులకు మాత్రమే మేలు జరుగుతున్నదన్నారు. రాష్ట్రంలో సీపీఐ సహకారంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల్లో ప్రజలకిచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేయాల్సిన బాధ్యత రేవంత్ సర్కార్‌పై ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని, అందుకు కార్యకర్తలు సిద్దంగా ఉండాలని హేమంతరావు పిలుపునిచ్చారు.సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భానుప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతరాములు, సభ్యులు కర్నాటి నళిని, బాగం నర్సింహారావు, నంబూరి నారాయణ, కాశిబోయిన అయోధ్య, పాలపాటి అశోక్, మారిశెట్టి వెంకటేశ్వర్లు, రాయల మాధవరావు, మల్లెబోయిన ఉపేందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడొద్దు

మేయర్ పునుకొల్లు నీరజ



ఖమ్మంసంక్షేమవిభాగం, మే14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడొద్దని మేయర్ పునుకొల్లు నీరజ ఆదేశించారు.బుధవారం 25వడివిజన్‌లో మేయర్ తనిఖీలు చేశారు. జనరల్ ఫండ్స్ రూ.79లక్షలతో నిర్మాణం జరుగుతున్న పనులను మేయర్ పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. నాణ్యతతో పాటుగా భవిష్యత్ నగర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పనులు చేపట్టాలని హెచ్చరించారు. డ్రెయినేజీ నిర్మాణాలను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు.

మాస్టర్ ప్లాన్‌కు కదలిక

- 2041 లక్ష్యంతో సుడా, కేఎంసీ సంయుక్త కార్యాచరణ
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో మేయర్ సమావేశం
- హాజరుకానున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు



ఖమ్మంసంక్షేమవిభాగం,మే14(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న జనాభా, నగరాలకు అనుగుణంగా భవిష్యత్ 20ఏళ్లను దృష్టిలో పెట్టుకొని ప్రతీ నగరానికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తారు. ఖమ్మం నగరానికి 2011లో మాస్టర్‌ప్లాన్ ఆమోదించారు. తర్వాత అనేక పర్యాయాలు మాస్టర్ ప్లాన్‌పై చర్చలు, సమీక్షలు జరిపినా కూడా ఖమ్మం నగర పాలక సంస్థ మాస్టర్ ప్లాన్‌కు మోక్షం కలగలేదు. వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టాక రాబోయే 20ఏళ్ల దృష్టిలో పెట్టుకొని 2041 ఖమ్మం నగరం విస్తరణపై మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన జరిగింది. కొన్నికారణాల వల్ల ఇటీవల కాలంలో ఆమోదం పొందలేక పోయింది. కాగా మంగళవారం రాత్రి ఖమ్మంలో కాంగ్రెస్ కార్పొరేటర్లుతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన సమావేశంలో ఖమ్మం మాస్టర్ ప్లాన్ చర్చకు రావటంతో మాస్టార్ ప్లాన్‌కు మోక్షం కలగబోతుంది.

నేడు మేయర్ సమావేశం

ఈ మేరకు మేయర్ పునుకొల్లు నీరజ గురువారం కాంగ్రెస్ కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించబోతున్నారు. ముఖ్యమైన సూచనలు స్వీకరించనున్నారు.గతంలో ఖమ్మం నగర పాలక సంస్థ వరకే మాస్టర్‌ప్లాన్ ఏర్పాటు కాగా ఇప్పుడు కేఎంసీతో పాటుగా సుడాను కలుపుకొని సంయుక్త మాస్టర్ రూపకల్పనకు కదలిక వచ్చింది. 2041ఖమ్మం నగరం విస్తరణ దృష్టిలో పెట్టుకొని ఖమ్మానికి రింగ్ రోడ్డు, అంతర్గత రహదారులు వెడల్పు వంటి అంశాలను నూతన మాస్టర్ ప్లాన్‌లో ఆమోదించనున్నారు. గతంలో ఉన్న మాస్టర్ ప్లాన్‌లో రాపర్తినగర్, ముస్తాఫానగర్, బైపాస్ రోడ్డు వెలుగుమట్ల ప్రాంతాలను కలుపుతూ 180 అడుగులు రోడ్డు ఉండేది.. దీంతో ఆ రహదారి విస్తీరణంలో భవనాల నిర్మాణ అనుమతులకు అడ్డంకి ఏర్పడింది. అయితే ఇప్పటి మాస్టర్ ప్లాన్‌లో ఆరోడ్డును తొలగించినట్లు తెలిసింది. దాంతో పాటుగా నగరంలో అవసరాల మేరకు 60అడుగుల రోడ్లను పెంచారు. అవసరం లేని వాటిని తొలగించారు. ప్రతీ చెరువుకు బఫర్ జోన్‌లను గుర్తించి వాటి సంరక్షణకు ఏర్పాట్లు చేశారు.

కేఎంసీ సంయుక్త మాస్టర్ ప్లాన్

గతంలో ఖమ్మం నగరానికే మాస్టర్ ప్లాన్ ఉండేది.. కానీ రాబోయే మాస్టర్‌ప్లాన్ కేఎంసీతో పాటుగా సుడా సంయుక్తగా రూపొందించబోతున్నారు. ఖమ్మంకార్పొరేషన్, వైరా మునిసిపాలిటీ, ఏదులాపురం, ఖమ్మం రూరల్‌లో 18గ్రామ పంచాయతీలు, కూసుమంచిలో 2, ముదిగొండ 5, చింతకాని 6, కొణిజర్ల 4, రఘునాథపాలెం 6, 45గ్రామ పంచాయతీలు కలిపి 2041 మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నారు. 572.48 చదరపు కీమీ విస్తీరణంలో ఇది వ్యాపించనుంది. 2011 జనాభా లెక్కల మేరకు 4,52,785 జనాభా ఉన్నారు. 2041 జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు.

గతంలో రెండు లైజనింగ్ సమావేశాలు

భక్తరామదాసుకళాక్షేత్రంలో లైజనింగ్ ప్రభుత్వ శాఖలతో ఇప్పటికే రెండుసార్లు సమావేశాలు నిర్వహించారు. ఇరిగేషన్, రహదారులుభవనాలు,అటవీశాఖ,రెవెన్యూ, మైనింగ్, రైల్వే,విద్యుత్, ఇతర శాఖల సమాచారంతో రూపొందించారు. ఇప్పుడు మేయర్‌తో నిర్వహించే సమావేశం కీలకంగా మారనుంది.

బల్లేపల్లిలో రెవెన్యూ మేళా

నేడు కొనసాగింపు

ఖమ్మంసంక్షేమ విభాగం, మే14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని విలీన ప్రాంతాల్లోని రెవెన్యూ సమస్యలు పరిష్కారం దిశగా కేఎంసీ రెవెన్యూ విభాగం అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో అల్లీపురంలో ప్రత్యేక రెవెన్యూ మేళా నిర్వహించారు. ఈ సమయంలో కొన్ని సమస్యలు పరిష్కారం చేయగా, బుధవారం 3వ డివిజన్ బల్లేపల్లిలో ప్రత్యేక రెవెన్యూ మేళా నిర్వహించారు. బల్లేపల్లి, ఎస్సీ కాలనీ విలీన ప్రాంతంలోని ఇంటి నెంబర్లు, ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపులు 15 మంది దరఖాస్తులు చేశారు. ఆర్ఐ రాంబాయి, బిల్ కలెక్టర్లు డీ అప్పయ్య, సీహెచ్ రాములు దరఖాస్తులు స్వీకరించారు. కాగా ప్రజలకు సరైన సమాచారం లేక పోవటంతో తక్కువ మంది దరఖాస్తులు చేశారని కాంగ్రెస్ నాయకులు మలీదు మనిష్ రెవెన్యూ అధికారులకు విన్నవించారు. దీన్ని పరిగణలోకి తీసుకున్న అధికారులు గురువారం బల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలలో రెవెన్యూ మేళాను కొనసాగిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బల్లేపల్లి రెవెన్యూ మేళాలో పాల్గొన్న అధికారులు

ఎఫ్ఏసీ హెచ్ఎంలను నియమించండి

ఖమ్మంఖానాపురంహవేలి, మే14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల స్థానంలో ఎఫ్ఏసీ ప్రధానోపాధ్యాయులను నియమించాలని బుధవారం ఖమ్మం నగరానికి విచ్చేసిన ఆర్జేడీ సత్యనారాయణరెడ్డికి పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు వినతిపత్రం అందించారు. స్కూల్ అసిస్టెంట్లకు ఎఫ్ఏసీ ర్యాటిఫికేషన్ ఆర్డర్లు ఇవ్వకపోవటంతో అలవెన్సుల బిల్లులు తిరస్కరిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కట్టా. శేఖర్, చంద్రశేఖర్, రవికుమార్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఇంటర్ స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్

తిరుమలాయపాలెం, మే14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ ఒకేషన్లలో సీట్ల భర్తీకోసం ఈనెల 15నుంచి 16వరకు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ భాస్కరరావు తెలిపారు. 15న బాలురు, 16న బాలికలకు గిరిజన గురుకుల బాలికల కళాశాల్లో, భద్రాచలంలో ఇంటర్ మొదటి ఏడాదికి ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు సంబందిత సర్టిఫికెట్లు తీసుకుని హాజరుకావాలని ఆయన కోరారు.

పబ్లిక్ టాయిలెట్‌కు శంకుస్థాపన

తిరుమలాయపాలెం, మే14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం తిరుమలాయపాలెంలో పబ్లిక్ టాయిలెట్‌కు బుధవారం ఎంపీడీవో సిలార్‌సాహెబ్ శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శంకుస్థాపన చేశారు. పబ్లిక్ టాయిలెట్ నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. ఆయన ఆదేశాలతో పబ్లిక్‌టాయిలెట్ నిర్మాణానికి శంకుస్థాపనచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సూర్యనారాయణ, కార్యదర్శి సుజాత, ఏపీవో నరసింహారావు, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పాల్గొన్నారు.

పల్లెజనం.. తెల్లమొహం!

- పల్లెదవాఖానాకు హాజరుకాని వైద్యులు
- మంచుకొండ పీహెచ్‌సీలో జీతం.. ఖమ్మంలో ప్రైవేట్‌లో డాక్టర్ విధులు
- విచారణ చేపట్టిన ఎన్‌హెచ్ఎం, పీవో బిందుశ్రీ



మంచుకొండ పీహెచ్‌సీ

రఘునాథపాలెం, మే14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లె దవాఖానాలను నమ్ముకుని వచ్చే గ్రామీణ రోగులు తెల్ల మొహం వేస్తున్నారు. వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు వస్తుండటంతో ఇబ్బందిపడుతున్నారు. ఖమ్మం నగరానికి అత్యంత సమీపంలో ఉన్న మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సిపారసుతో వచ్చిన ఎంబీబీఎస్ వైద్యులు, బీఎస్సీ నర్సింగ్ ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవడైర్లు)లు పల్లె దవాఖానాల్లో వైద్యం చేయటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 12ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వాటిని నూరుశాతం పల్లెదవాఖానాలుగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అప్‌గ్రేడ్ చేశాయి. వాటిలో మంచుకొండ, చింతగుర్తి, వీవీ పాలెం మినహా 9పల్లె దవాఖానాల్లో వైద్యులను నియామకాలు జరిగాయి. వీవీపాలెంలో మాత్రం బీఎస్సీ నర్సింగ్‌పూర్తి చేసిన వారికి ఎంఎల్‌హెచ్‌పీగా ఉద్యోగం కల్పించారు. అయితే కొన్నినెలలుగా మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పల్లెదవాఖానా వైద్యుల సమయ పాలనపై అనేక విమర్శలు వెలువడుతున్నాయి. నిబంధనల మేరకు పల్లెదవాఖానా వైద్యులకు జిల్లా స్థాయిలో మాత్రమే సెలవ్‌లు మంజూరు కావాల్సి ఉంటుంది. కానీ మంచుకొండ పీహెచ్‌సీలో సూపర్‌వైజర్ క్యాడర్ వారే ఎంబీబీఎస్‌లకు సెలవ్ పర్మిషన్ ఇస్తున్నారు. దీంతో ఇక్కడి వైద్యులు ఖమ్మంలోని ప్రైవేట్ హాస్పటల్స్‌లో డ్యూటీ డాక్టర్లుగా విధులు సైతం నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో వీవీ పాలెం ఎంఎల్‌హెచ్‌పీ తరుచూ సెలవ్‌లపై వెళ్లటంతో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు దృష్టి సారించారు. గతంలోను డీఎంహెచ్‌వో కళావతిబాయి తనిఖీలు చేపట్టగా ఎంఎల్‌హెచ్‌పీ అందుబాటులో లేరు. దీంతో ఎన్‌హెచ్ఎం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బిందుశ్రీ, డీపీవో దుర్గా బుధవారం వీవీపాలెం పల్లెదవాఖానాలో విచారణ జరిపారు.

రసాయన ఎరువులను సమతుల్యంగా వాడాలి

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్



మాట్లాడుతున్న శాస్త్రవేత్త హేమంత్‌కుమార్

సత్తుపల్లి, మే14 (ఆంధ్రజ్యోతి) రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా రసాయన ఎరువులను తగిన మోతాదులో వాడాలని వ్యవయసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె. హేమంత్‌కుమార్ సూచించారు. బుధవా రం సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమాన్ని నిర్విహించారు. వ్యవసాయ కళాశాల శాస్తవేతలు ఎం. రాంప్రసాద్, ఆర్ రమేష్‌లు మాట్లాడుతూ భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఉద్యాన అధికారి శ్రావణి మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగులో పాటించాల్సిన మెలకువలపై వివరించారు. పశువైదాధికారి శశిదీప్, ఏవో వై. శ్రీనువాసరావులు మాట్లాడుతూ విత్తనాలు, రసాయనాలు కోనుగోలు చేసినప్పుడు రైతులు తప్పని సరిగ్గా రసీదులు పొం ది భద్రపరుచుకోవాలని కోరారు. గంగారం పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి మాట్లా డుతూ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలం శాస్త్రవేతలను, రైతుకు మరింత చేరువ చేసే ఉద్దేశ్యంతో ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ కారక్రమంలో ఏఈఓ వాసంతి, ఆయిల్ ఫామ్ ఎఫ్‌పీవో ప్రతినిధులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

18న సంతాప సభ

ఖమ్మంఖానాపురంహవేలి, మే14(ఆంధ్రజ్యోతి):ప్రపంచ ప్రసిద్ధ ధార్మిక పండితులుగా మానవతావాదిగా పేరుగాంచిన హజరత్ మౌలానా మొహమ్మద్ వస్తావని సంతాపసభ ఈనెల18న జరగనున్నది.ఈ సందర్భంగా బుధవారం నగరంలోని జైనమసీదులో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇమామో ఖతీబ్ మోతి మసీద్ మౌలానా అబ్దుల్ ఘని రషాది, హాఫీజ్ మహమ్మద్ జువ్వాద్ అహ్మద్, ముఫ్తీ అబ్దుల్ ఖలీక్, హాఫీజ్ ఇమ్రాన్, బీఆర్ఎస్ జిల్లా మైనారిటి అధ్యక్షుడు తాజుద్దీన్ తదితరలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐగా శ్రీకాంత్‌గౌడ్

ఖమ్మం క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ట్రాఫిక్ సీఐగా జి.శ్రీకాంత్‌గౌడ్‌ను నియమిస్తూ పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. కరీంనగర్‌లో పీటీసీలో సీఐగా ఉన్న ఆయనను ఇటీవల మల్టీజోన్-1కు అటాచ్ చేశారు. అక్కడి నుంచి ఖమ్మం ట్రాఫిక్ సీఐగా బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా మల్టీజోన్-1 హైదరాబాద్‌లో వెయిటింగ్‌లో ఉన్న బి.బాలాజీ ని ఖమ్మం టాస్క్‌ఫోర్స్ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చిమ్మపూడిలో బ్రహ్మోత్సవాలు

ఘనంగా రథోత్సవం



చిమ్మపూడిలో రథోత్సవం

రఘునాథపాలెం, మే14(ఆంధ్రజ్యోతి): చిమ్మపూడిలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల10నుంచి ప్రారంభమయ్యాయి. కాగా బుధవారం ఉదయం గ్రామంలోని మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం భక్తుల కోలాహలం మధ్య శ్రీలక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం కార్యక్రమం నిర్వహించారు. నాలుగు రోజులుగా వేదమంత్ర గోషణలతో చిమ్మపూడి మారుమోగుతోంది.ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు ముడుంబై మురళీధరాచార్యులు, అర్చకులు రవికిరణ్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

లేబర్‌కోడ్స్‌ను వెనక్కి తీసుకోవాలి

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు

ఖమ్మంరూరల్, మే14(ఆంధ్రజ్యోతి) కార్మికుల బతుకులు చిన్నాభిన్నం చేస్తున్న నాలుగు లేబర్‌కోడ్స్‌ను వెంటనే వెనక్కు తీసుకోవాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ మేడికొండనాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డులో బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. 29 చట్టాలను నాలుగు కోడ్స్‌గా మార్పు అమలు జరిగితే కార్మికులు రోజురోజుకు 12గంటల నుంచి16గంటలు పని చేయాల్సి వస్తుందన్నారు. ప్రత్యేకంగా నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులకు వేల్ఫేర్ బోర్డు ద్వారా పొందే ఫలితాలు అందకుండా పోయే పరిస్థితి రాబోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రావు, రాంబ్రహ్మం, వెంకన్న, వీరయ్య, నాగభూషణం, ఉపేందర్ పాల్గొన్నారు.

రక్తదానం చేయటం ప్రాణదానం చేయటమే

నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్

నేలకొండల్లి, మే14(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయటమంటే ప్రాణదానం చేయటమేనని నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం మండల పరిధిలోని చెర్వుమాధారంలోని ప్రభుత్వ పాఠశాలలో నీతోడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎస్ఐ సంతోష్ ప్రారంభించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎందరో రక్తం కోసం ఎదురు చూస్తుంటారన్నారు. రక్తదానం చేయటానికి యువత ముందుకు రావాలని, అందుకు నీతోడు లాంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. దాదాపు 50యువకులు శిబిరంలో రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు ఎస్ఐ సంతోష్ సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో నందిగామ మనోహర్, వూటుకూరి రమేష్, ఏఎస్ఐ సీతరాములు, కానిస్టేబుల్ రాజేష్, పంచాయతీ కార్యదర్శి భాషా పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందచేస్తున్న నేలకొండపల్లి ఎస్ఐ

వైరాలో ధాన్యం కొనుగోళ్ల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

వైరా, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుణ్యపురం గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సివిల్‌సప్లయి డీఎం గంటా శ్రీలత, డీసీఎంఎస్ మేనేజర్ సందీప్ పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్ల తీరుపై రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసిందని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. డీసీఎంఎస్ ఉద్యోగి నాగరాజు పాల్గొన్నారు.

పరామర్శ

పెనుబల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): కారాయిగూడెం సొసైటీ అధ్యక్షుడు చింతనిప్పు సత్యనారాయణ కోడలు ప్రమీల ఇటీవల మృతిచెందగా కుటుంబాన్ని ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. ప్రమీల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. అనంతరం కొత్తకారాయిగూడెంలోని నరుకుళ్ల సత్యనారాయణ కుమారుడు శ్రీనాధ్‌కు వర్షితతో వివాహం జరుగగా నూతన వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో చింతనిప్పు సత్యనారాయణ, పసుమర్తి వెంకటేశ్వరరావు, మందడపు అశోక్, చెక్కిలాల మోహన్‌రావు, కొప్పుల గోవిందరావు, చీకటి మోహన్‌రావు, దొడ్డపనేని రవి పాల్గొన్నారు.

ఎస్‌ఐను కలిసిన నాయకులు

వైరా, మే 14 (ఆంధ్రజ్యోతి): వైరా ఎస్‌ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పి.రామారావును మండలంలోని కొండకొడిమ గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ గ్రామ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మాజీ సర్పంచ్ దొంతెబోయిన శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీలు వాకదాని వెంకటేశ్వరరావు, కొప్పుల వెంకటేశ్వరరావు, దొంతెబోయిన వెంకటనారాయణ, శేషగిరిలు ఎస్‌ఐను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



మధిరరూరల్, మే14(ఆంధ్రజ్యోతి): పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల తీగలు చేతికందే ఎత్తులో ఉండడంతో ప్రమాదకరంగా మారాయి. దీంతో అటువైపుగా పొలాలకు వెళ్లే రైతులు భయపడుతున్నారు. ఖమ్మంపాడు గ్రామ శివారులోని ఎస్సీ కాలనీ దాటాక ఖమ్మంపాడు, అన్నవరం గ్రామాల మధ్య పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు చేతికందే ఎత్తులో ఉండి ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా గాలిదుమారం, ఉరుములు, మెరుపులు వచ్చిన సందర్భంలో రైతులు అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్లను పొలాల్లో సరిచేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

ఆటాడేదెలా..?

- వెలవెలబోతున్న క్రీడా ప్రాంగణాలు
- కనిపించని ఆట వస్తువులు
- వినియోగంలోకి తీసుకురావాలని వినతి

పెనుబల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో యువతకు మానసిక ఉల్లాసాన్ని కల్పించేందుకు ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటుచేసి వివిధ రకాల క్రీడా సామగ్రిని పంచాయతీలకు అప్పగించారు. చాలా పంచాయతీల్లో నేటికీ ఆ క్రీడా సామగ్రిని బయటకు తీసిన దాఖలాలు లేవని యువకులు ఆరోపిస్తున్నారు.

పెనుబల్లి మండలంలో 33పంచాయతీల్లో 26 పంచాయతీలకు క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి క్రికెట్, వాలీబాల్, టెన్నీకాయిట్ తదితర కిట్లను సుమారు రూ.లక్షన్నరతో పంచాయతీలకు 2022లో అప్పగించారు. ఈ సామగ్రిని కొన్ని పంచాయతీల్లో కనీసం బయటకు తీయకపోవడంతో కార్యాలయాల్లోనే మూలనపడ్డాయి. పెనుబల్లి, వీఎంబంజర్ పంచాయతీల్లోనూ క్రీడా మైదానాలు ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ, వీఎంబంజర్ ఉన్నత పాఠశాలలోనూ క్రీడా సామగ్రిని ఆయా సంస్థలకు అప్పగించారు. వాటిని గ్రామాల్లోని తమకు ఆడుకునేందుకు ఇవ్వడం లేదని యువకులు ఆరోపిస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన క్రీడా సామగ్రి తమకు నిరుపయోగంగా ఉండటం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో ఉన్న క్రీడా సామగ్రిని తమకు అందించాలని యువకులు కోరుతున్నారు.



సొంతంగా కొనుగోలు చేసిన వాలీబాల్‌తో ఆడుకుంటున్న యువకులు



పెనుబల్లి జీజేసీలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

క్రికెట్ కిట్లను అందించాలి

• తేజావత్ రాయుడు, క్రీడాకారుడు



ప్రభుత్వం ఇచ్చిన క్రీడా సామగ్రి కిట్లను యువకులకు ఆడుకొనేందుకు ఇవ్వాలి. ప్రభుత్వం రూ.రెండులక్షలతో కిట్లు అందజేసినప్పటికీ అధికారులు ఆయా గ్రామాల్లో యువత ఆడుకొనేందుకు ఇవ్వడం లేదు. కనీసం వేసవి కాలంలోనైనా యువతకు క్రీడా సామగ్రిని అందజేయాలి.

కొనుగోలు చేసి మూలనపడేశారు

• ధీరునాయక్, క్రీడాకారుడు



లక్షలాదిరూపాయలతో క్రీడా సామగ్రిని కొనుగోలు చేసి యువకులు ఆడుకునేందుకు ఇవ్వకుండా అధికారులు మూలనపడేశారు. యువత ఆడుకునేందుకు క్రీడా సామగ్రిని ఇవ్వాలి. ప్రాంగణాలను వినియోగంలోకి తేవాలి.

సంక్షేమ పథకాల అమలు బాధ్యత మీదే



కలకోటలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం, మే14(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ ఫలాలను పేద ప్రజలకు చెరవేర్చే బాధ్యత కార్యకర్తలదేనని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలో గల కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తల్లపురెడ్డి నాగిరెడ్డి ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, మండలపార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శీలం శ్రీనివాసరెడ్డి, బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, అనుమోలు కృష్ణారావు, యరమల పూర్ణచంద్రారెడ్డి, మల్లెల లక్ష్మణరావు, ఎఎంసీ డైరెక్టర్లు, ఆత్మకమిటీ డైరెక్టర్లు,క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

బోనకల్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలకోట, రావినూతల గ్రామాల్లో బుధవారం పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, నాయకులు చేబ్రోలు వెంకటేశ్వర్లు, చేబ్రోలు రమ, వట్టికొండ రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ మోదుగు సుదీర్‌బాబు, నల్లమోతు సత్యనారాయణ, మరీదు శ్రీనివాసరావు, అనుమోలు వెంకటేష్, గూడ నర్సయ్యశాస్త్రీ, చిర్రా ఆదిలక్ష్మి, గుత్తా ద్రౌపది, అంతోటి వెంకటేశ్వర్లు, కందుల పాపారావు, హేమూన్ తదితరులున్నారు.

జాతీయ ర్యాంకర్‌కు అభినందన

మధిరటౌన్, మే14(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ ఫలితాల్లో 454 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించిన మధిర సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి మల్లవరపు తేజ కార్తీక్‌ను డిప్యూటీ సీఎం భట్టి మధిరలోని క్యాంపు కార్యాలయంలో అభినందించారు.

వైరాలో...

వైరా, మే 14 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పదోవార్డు సోమవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గొల్లపూడి కృష్ణారావును డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పరామర్శించారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు పాల్గొన్నారు.



కృష్ణారావును పరామర్శిస్తున్న భట్టి

యువ వికాసం దరఖాస్తుల పరిశీలన

కల్లూరు, మే14 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం యువ వికాసం దరఖాస్తులపై డిప్యూటీ సీఈవో నాగపద్మజ సమీక్ష సమావేశం నిర్వహించారు. 4,500 దరఖాస్తులు రాగా వాటిపై పరిశీలన జరిపి అందులో 955 మందితో అర్హుల జాబితాను ఎంపిక చేసి సంబంధిత బ్యాంకులకు పంపడం జరిగిందని ఎం పీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ సత్యనారాయణశర్మ, ఎంపీవో రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం: ఎమ్మెల్యే

కారేపల్లి, మే14(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పైలట్ గ్రామపంచాయతీగా ఎంపికైన కొత్తతండా గ్రామ పంచాయతీలో అర్హులైన వారికి మంజూరైనా ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపనచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గల అన్నివర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పనిచేస్తుందన్నారు. మండల కేంద్రంలో 63మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చేతుల మీదుగా కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్

మధిరటౌన్, మే14(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిడమానూరి వంశీ, తూమాటి నవీన్ రెడ్డి, చావా వేణు, బాలరాజు, కర్నాటి రామారావు, అద్దంకి రవి, బాలరాజు, జహంగీర్, రమణ, బాబు, సంగయ్య, చక్రీ తదితరులు పాల్గొన్నారు.

బల్లేపల్లిలో రెవెన్యూ మేళా

ఖమ్మంసంక్షేమ విభాగం, మే14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని విలీన ప్రాంతాల్లోని రెవెన్యూ సమస్యలు పరిష్కారం దిశగా కేఎంసీ రెవెన్యూ విభాగం అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో అల్లీపురంలో ప్రత్యేక రెవెన్యూ మేళా నిర్వహించారు. ఈ సమయంలో కొన్ని సమస్యలు పరిష్కారం చేయగా, బుధవారం 3వ డివిజన్ బల్లేపల్లిలో ప్రత్యేక రెవెన్యూ మేళా నిర్వహించారు. బల్లేపల్లి, ఎస్సీ కాలనీ విలీన ప్రాంతంలోని ఇంటి నెంబర్లు, ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపులు 15 మంది దరఖాస్తులు చేశారు. ఆర్ఐ రాంబాయి, బిల్ కలెక్టర్‌లు డీ అప్పయ్య, సీహెచ్ రాములు దరఖాస్తులు స్వీకరించారు. కాగా ప్రజలకు సరైన సమాచారం లేక పోవటంతో తక్కువ మంది దరఖాస్తులు చేశారని కాంగ్రెస్ నాయకులు మలీదు మనిష్ రెవెన్యూ అధికారులకు విన్నవించారు. రెవెన్యూ మేళాను కొనసాగిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కారేపల్లిలో సీపీఐ నియోజకవర్గ సమావేశం

కారేపల్లి, మే14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో శుక్రవారం సీపీఐ వైరా నియోజకవర్గ సమితి సమావేశం జరుగుతుందని వైరా డివిజన్ కార్యదర్శి ఎర్రబాబు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సమితి సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పాల్గొంటారన్నారు. సకాలంలో సభ్యులు సమావేశానికి చేరుకోవాలని ఆయన కోరారు.

రసాయన ఎరువులను సమతుల్యంగా వాడాలి

» వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్



మాట్లాడుతున్న శాస్త్రవేత్త హేమంత్‌కుమార్

సత్తుపల్లి, మే14 (ఆంధ్రజ్యోతి) రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా రసాయన ఎరువులను తగిన మోతాదులో వాడాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె. హేమంత్‌కుమార్ సూచించారు. బుధవారం సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ కళాశాల శాస్త్రవేతలు ఎం. రాంప్రసాద్, ఆర్ రమేష్‌లు మాట్లాడుతూ భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఉద్యాన అధికారి శ్రావణి మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగులో పాటించాల్సిన మెలకువలపై వివరించారు. పశువైద్యాధికారి శశిదీప్, ఏవో వై. శ్రీనువాసరావులు మాట్లాడుతూ విత్తనాలు, రసాయనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పని సరిగ్గా రసీదులు పొంది భద్రపరుచుకోవాలని కోరారు. గంగారం పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలం శాస్త్రవేతలను, రైతుకు మరింత చేరువ చేసే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ కారక్రమంలో ఏఈఓ వాసంతి, ఆయిల్ పామ్ ఎఫ్‌పీవో ప్రతినిధులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ట్రెజరీ డీడీకి సన్మానం

వైరా, మే 14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లా ఖజానా కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన వైరా ఏటీవో టీఎస్‌జీఎల్.ప్రసన్నకుమార్‌ను విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. వైరా ఏటీవోగా ప్రసన్నకుమార్ అందిస్తున్న సేవలను ప్రశంసించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఎన్.పెంటయ్య, తల్లాడ కృష్ణారావు, ఎస్.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ మండల కార్యదర్శి ఏ.సుధాకర్, ఉపాధ్యక్షుడు పి.భాస్కర్‌రావు, ఎస్టీవో సీనియర్ అసిస్టెంట్లు ఎల్లయ్య, దుర్గాప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, జ్యోతి పాల్గొన్నారు.



ప్రసన్నకుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

విలువలున్న గొప్ప నాయకుడు రాయల

» మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు



రాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నామా

తల్లాడ, మే14(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లోపడిలేచిన కెరటం, ప్రజాభిమానం చూరగొన్న ఉన్నత విలువలున్న గొప్ప నాయకుడు రాయల వెంకట శేషగిరిరావు అని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు కొనియాడారు. బుధవారం మండలంలోని మిట్టపల్లి గ్రామంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకట శేషగిరి రావు ప్రథమ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నామా మాట్లాడుతూ ఎప్పుడు ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యలపై పనిచేశారన్నారు. రైతునాయకుడిగా, డీసీసీబీ డైరెక్టర్‌గా, డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎనలేని కృషిచేశారన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తాళ్లూరి జీవన్‌కుమార్, తల్లాడ మండల అధ్యక్ష కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, వైరా మండల కమిటీ అధ్యక్షుడు బానాల వెంకటేశ్వర్లు, మోరంపుడి ప్రసాదరావు, మొండితోక జయకర్, రంగిశెట్టి కోటేశ్వరరావు, వజ్రాల రామిరెడ్డి, బద్దం కోటిరెడ్డి, కేతినేని చలపతిరావు, మువ్వా మురళీధర్‌రావు, నాయుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కోపెల కనకయ్య, మాజీ సర్పంచ్ శెట్టిపల్లి లక్ష్మణరావు, పాల్వంచ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

మధిరరూరల్, మే14(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు శీలం నరసింహారావు కోరారు. బుధవారం మధిరలో జరిగిన హమాలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికవర్గం అనేక త్యాగాల పోరాటాలతో సాధించుకున్న 29కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చే అమలుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందన్నారు. ఈసమావేశంలో పడకంటి మురళి, పోతురాజు పాల్గొన్నారు.

'భూ భారతితో సమస్యల పరిష్కారం'



దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ పున్నం చందర్

బోనకల్, మే 14 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారమే భూ భారతి చట్ట లక్ష్యమని తహసీల్దార్లు పున్నం చందర్, రాంబాబు లు తెలిపారు. మండలంలోని ముష్టికుంట్ల, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ముష్టికుంట్లలో 185, బ్రాహ్మణపల్లిలో 53 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ భూ సమస్యలను పరిష్కరించడం కోసం సదస్సుల నిర్వహణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్లు మైథిలీ, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మాఇంటి-మణిదీపం' కార్యక్రమం



కొణిజర్లలో..

కొణిజర్ల, మే14(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లే ఇంటికి వెలుగని, ఆడపిల్ల అని ఎవరూ చులకనగా చూడవద్దని ఏసీడీపీవో ఉషారాణి, ఎంపీడీవో రోజారాణి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని తనికెళ్లలో మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా ఆడపిల్ల జన్మించిన దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు శివరంజని, కళావతి, పిచ్చమ్మ, ఝాన్సీ లు పాల్గొన్నారు.

పెనుబల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): సూరయ్యబంజర తండాలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మాఇంటి-మణిదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. బాణోతు అంజలి, ఉపేంద్ర దంపతులకు ఆడబిడ్డ జన్మించటంతో ఐసీడీఎస్ ఏసీడీపీవో మెహరున్నీసాబేగం ఆధ్వర్యంలో దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనురాధ, పంచాయతీ కార్యదర్శి భార్గవి, హెల్త్ సూపర్‌వైజర్ నిర్మలకుమారి, అంగన్‌వాడీ టీచర్ సత్యావతి, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, గ్రామసమాఖ్య అధ్యక్షురాలు కమల పాల్గొన్నారు.

మధిరరూరల్, మే14(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లతోనే ఇంటికి పరిపూర్ణత వస్తుందని మధిర మండల స్పెషలాఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. మహిళ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలో ని ఖమ్మంపాడులో మా ఇంటి మణిదీపం కార్యక్రమం నిర్వహించారు. షఫ్రక్ మనీషాబేగం, అమీర్ దంపతులను సత్కరించారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో బాలాత్రిపురసుందరి, సూపర్‌వైజర్లు కె.జ్యోతికుమారి, టి.సుజాతకుమారి, ఏహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి: పుట్టిన ఆడపిల్లలను, మగపిల్లలకు దీటుగా చదివించాలని మండల ప్రత్యేక అధికారి నవీన్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ-1కేంద్రంలో మా ఇంటి- మణిద్వీపం కార్యక్రమంలో భాగంగా ఆడబిడ్డకు జన్మనిచ్చిన తల్లి దండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి నవీన్‌బాబు, ఎంపీడీవో సురేందర్, సెక్టార్ సూపర్‌వైజర్ జి.రాధమ్మ, సిబ్బంది లక్ష్మి, డి.విజయకుమారి, పంచాయతీ కార్యదర్శి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ : ఆడపిల్లను కనడం అదృష్టంగా భావించి ప్రోత్సాహించాలని తల్లాడ మండల ప్రత్యేకాధికారి శివకుమార్ అన్నారు. బుధవారం మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్సూర్‌తండాలో బానోతునిహారిక-రవి దంపతులకు ఆడపిల్ల జన్మించిందని వారిని సత్కరించారు. ఈకార్యక్రమంలో సీడీపీవో నిర్మలజ్యోతి, ఎంపీడీవో సురేష్ బాబు, ఏసీడీపీ నవ్యశ్రీ, సూ పర్‌వైజర్లు రత్నకుమారి, రోజా, సత్యవతి, అంగన్‌వాడీ టీచరచ్లు కమల, సుభద్ర తదితరుల పాల్గొన్నారు.

ఏన్కూరు: ఆడపిల్లలు ఇంటికి వెలుగని మండల ప్రత్యేక అధికారి సాయినాథ్ అన్నా రు. బుధవారం తిమ్మరావుపేట సెక్టార్ పరిధిలోని రామ్‌నగర్‌తండా గ్రామంలో మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బక్కమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సుగుణ, ఎం.పద్మ, వి.పద్మ తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లిలో...



మధిరరూరల్‌లో...



కారేపల్లిలో...